



ఇదేం మేనిఫెస్టో!

టీడీపీ సూపర్ సిక్స్ ముందు వైసీపీ బౌల్డ్

- పెదవి విరుస్తున్న ప్రజలు.. తలలు పట్టుకుంటున్న అధికార పార్టీ శ్రేణులు
- నాలుగేళ్ల తర్వాత పెన్షన్ పెంచుతామంటూ సీఎం ప్రకటనపై వృద్ధుల పెదవి విరుపు
- అధికారంలోకి రాగానే నాలుగు వేలు చేస్తామంటున్న టీడీపీ కూటమి
- అమ్మ ఒడి రూ.17 వేలకు పెంపు.. అదీ ఒక్కరికేనంటున్న వైసీపీ
- ఎంత మంది పిల్లలను చదివిస్తే అందరికీ ఇస్తామంటున్న చంద్రబాబు
- పోలవరం, జలయజ్ఞం పూర్తి చేస్తామంటూ మళ్లీ అదే హామీ

సీఎం జగన్ శనివారం ప్రకటించిన వైసీపీ మేనిఫెస్టో తేలిపోయింది. అధికార పార్టీతోపాటు ప్రతిపక్షాలు, ప్రజల్లోనూ ఇదే భావన వ్యక్తమవుతోంది. టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ ముందు వెలవెలబోయింది. ఒక్కో పథకాన్ని విశ్లేషిస్తే ఇదే విషయం అర్థమవుతోంది.

(ఏలూరు సిటీ/ఏలూరు రూరల్/నూజివీడు)

వృద్ధులు, వికలాంగులకు ప్రస్తుతం మూడు వేలు పింఛన్ ఇస్తున్నారు. తాము అధికారంలోకి రాగానే నెలకు రూ.4,000 పెన్షన్ ఇస్తామని, అది కూడా ఈ ఏప్రిల్ నుంచే అమలు చేస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడు నెలలు వెయ్యి చొప్పున బకాయి కలిపి జూలైలో మొత్తం రూ.7 వేలు ఇంటికే అందజేస్తామని స్పష్టం చేశారు. ఆ తర్వాత ప్రతి నెలా రూ.4 వేలు ఇవ్వనున్నారు. కాని వైఎస్ జగన్ మేనిఫెస్టోలో పింఛన్‌ను మూడు వేల 500కు పెంచుతూ పోతానని చెప్పారు. అంటే నాలుగేళ్లపాటు మూడు వేలు చొప్పున ఇచ్చి, ఆ తర్వాత ఏడాది రూ.3,250, ఐదో ఏడాది రూ.3500 ఇవ్వనున్నట్టు చెప్పారు. ఇదే ఇప్పుడు పింఛన్‌దారుల్లో చర్చగా మారింది.

మహిళలకు అలా..

మరోవైపు బీసీ మహిళలకు 50 ఏళ్లకే పెన్షన్‌ను ఇస్తామంటూ కూటమి హామీ ఇచ్చింది. సంక్షేమ పథకాలు ఇస్తున్నామంటూ గొప్పగా చెబుతున్న జగన్ ఇప్పుడు కొత్త లెక్కలు చెప్పుకొచ్చారు.



అమ్మ ఒడిని రూ.15 వేల నుంచి రూ.17 వేలకు పెంచనున్నారు. ఇందులో రూ.2 వేలు పాఠశాలల నిర్వహణకు మినహాయిస్తామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఇంటిలో ఒక్క విద్యార్థికి మాత్రమే అమ్మ ఒడి ఇస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంత మంది పిల్లలు వుంటే అందరికి రూ.15 వేలు వంతున ఇవ్వనున్నట్టు మేనిఫెస్టోలో స్పష్టం చేశారు. ఇక్కడ కూడా కూటమిదే పైచేయిగా నిలిచింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు రూ.18,500 ఇచ్చారు. మరో ఐదేళ్లపాటు ఇదే కొనసాగిస్తామని వైసీపీ చెప్పుకొచ్చింది. అది కూడా 45 ఏళ్లు దాటి 60 ఏళ్లలోపు మహిళలకు అందజేసింది. కూటమి మాత్రం 18 ఏళ్లు నిండిన మహిళలకు మహలక్ష్మి పథకంలో నెలకు రూ.1500 ఇవ్వనున్నారు. ఇలా సంక్షేమ పథకంలో అమలులోనూ కూటమి మేనిఫెస్టో ముందు వరసలో ఉంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితం వంటి పథకాలను సూపర్ సిక్స్‌లో టీడీపీ కూటమి పొందుపరిచింది.

కార్పొరేషన్‌ల ఊసే లేదు

వైసీపీలో 53 కార్పొరేషన్‌లు ఏర్పాటుచేశారు. ఒక్క దానికి నిధులు కేటాయించలేదు. ఇప్పుడు కార్పొరేషన్ల కోసం పెద్దగా పట్టించుకోలేదు. అదే కూటమి అయితే బీసీ సబ్ ప్లాన్ అమలు చేసి రాయితీ రుణాలు అందజేస్తామని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించేది లేదని, వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన 23 సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

మరో ఐదేళ్లలో పోలవరం పూర్తి

టీడీపీ ప్రభుత్వంలో 72 శాతం మేర పోలవరం ప్రాజెక్ట్ పనులు పూర్తి చేశారు. రివర్స్ టెండరింగ్ అంటూ వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్‌ను మార్చి వేసింది. ఐదేళ్లపాటు ప్రాజెక్ట్‌ను పెద్దగా పట్టించుకోలేదు. మరో ఐదేళ్లలో పూర్తి చేస్తామంటూ జగన్ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందంటూ ప్రతిపక్షాలు దెప్పి పొడుస్తున్నాయి. పోలవరంతోపాటు, అమరావతి రాజధానిని పూర్తి చేస్తామని కూటమి ప్రకటించింది. మూడు రాజధానులన్న జగన్ మేనిఫెస్టోలో ఆ విషయాన్నే పెద్దగా ప్రస్తావించలేదు. మరోవైపు హార్బర్‌లు పూర్తి చేస్తామంటూ జగన్ ప్రకటించడంపై అంతా పెదవి విరుస్తున్నారు. జిల్లాలో బియ్యపుతిప్ప వద్ద హార్బర్‌కు ఇప్పటి వరకు పునాది రాయి వేయలేదు. ఆక్వా యూనివర్శిటీ తరగతులు ప్రారంభించలేదు. మెడికల్ కళాశాల అంటూ ఊదరగొట్టి కనీసం పూడిక చేయలేదు. మరో ఐదేళ్లలో వాటిని పూర్తి చేస్తామంటూ జగన్ చెప్పుకొచ్చారు. జలయజ్ఞం పూర్తిచేస్తామంటూ ప్రకటనలు గుప్పించారు. ఐదేళ్లలో జిల్లాలో వరి రైతులకు ఉపయోగపడే కాలువలను మరమ్మతులు చేపట్టలేకపోయారు. బిల్లులు చెల్లించలేదు. ఉప్పుటేరుపై రెగ్యులేటర్‌లకు శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటి వరకు వాటికి అనుమతులు మంజూరు చేయలేదు. దీంతో వైసీపీ మేనిఫెస్టోపై విశ్వసనీయత లేదంటూ సర్వత్రా చర్చనీయాంశమైంది.

పీజీ కోర్సులకు రీయింబర్స్ లేదు

వైసీపీ హయాంలో పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తొలగించారు. జిల్లాలో అధిక సంఖ్యలో విద్యార్థులు పీజీ కోర్సులకు దూరమయ్యారు. తాజా మేనిఫెస్టోలోను దీని ప్రస్తావన లేదు. బకాయిలను చెల్లించలేదు. అదే కూటమి అధికారంలోకి వచ్చిన తక్షణమే ఈ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధిని కొనసాగిస్తామని కూటమి ప్రకటించింది. అదే హామీతో జనంలోకి వెళుతున్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అమలు చేస్తామని కూటమి ఎన్నికల హామీ ఇచ్చింది. నిరుద్యోగ యువతకు రూ.3 వేల భృతిని అందజేయనున్నట్టు స్పష్టం చేసింది.

రైతుకు ఉత్తుత్తి హామీలేనా

రైతులకు రూ.12,500 రైతు భరోసా ఇస్తామని జగన్ గత ఎన్నికల ముందు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ. ఆరు వేలకు అదనంగా రూ.7,500 మాత్రమే ఇచ్చారు. మరోసారి రైతులకు అదనంగా ఏమి చేస్తారో జగన్ చెప్పలేకపోయారు. అదే టీడీపీ కూటమి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేస్తామంటూ హామీ ఇచ్చింది. ఆక్వా రంగానికి జోన్‌తో నిమిత్తం లేకుండా రూ.1.50లకే యూనిట్ విద్యుత్ అందజేయనున్నట్టు భరోసా కల్పించింది. పండ్ల తోటలకు సబ్సిడీలు అటకెక్కాయి. డ్రిప్ ఇరిగేషన్ పూర్తిగా కనుమరుగైంది. ఇలా చెబుతూ పోతే 2019లో వైసీపీ ఇచ్చిన హామీలో కొంత వరకే అమలు చేశారు. ఇళ్ళు, ఇళ్ళ స్థలాల కేటాయింపు విషయంలో లబ్ధిదారులకు నిరాశే మిగిలింది.

జగన్ నయవంచన



గత ఎన్నికల వేళ నవరత్నాల పేరిట జగన్ మభ్యపెట్టాడు. ప్రజల జీవితాల్లో వెలుగులు తెస్తానంటూ నమ్మించాడు. అధికారంలోకి వచ్చాక టీడీపీ పథకాలు అన్ని రద్దు చేసి నవరత్నాల పథకాల్లో అర్హుల పేరిట అడ్డగోలుగా కోత పెట్టారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అటకెక్కించారు. ప్రజలకు జగన్ మంచి చేయలేదు. తాజా మేనిఫెస్టోను ప్రజలను నయవంచన చేసేలా ఉంది. నవరత్నాలతో ప్రజల జీవితాలు బాగుపడలేదు.

\- లంకపల్లి మాణిక్యాలరావు, శనివారపుపేట

జాబ్ క్యాలెండర్ మోసం



వైసీపీ మేనిఫెస్టోను ప్రజలు నమ్మేస్థితి లేదు. గత మేనిఫెస్టోలో ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని, నిరుద్యోగులకు మొండిచేయి చూపించారు. సీపీఎస్ రద్దు చేస్తామంటూ ఉద్యోగులను మోసం చేశారు. వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాల్లో అడ్డంకులు సృష్టించి లబ్ధిదారులకు కోత వేశాడు. ఇప్పుడు మరో మోసకారి మేనిఫెస్టోను జగన్ విడుదల చేశారు. మరోసారి జగన్‌ను నమ్మితే నట్టేట మునిగినట్టే.

\- మొద్దుల పవన్‌కుమార్, ఏలూరు

• పాత సీసాలో పాత సారా



వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో పాత సీసాలో పాత సారా మాదిరిగా ఉంది. వృద్ధులకు పెన్షన్‌ను 2028 నుంచి రూ. 500 పెంచుతారట. అదే కూటమి అధికారంలోకి వస్తే ఈ ఏప్రిల్ నుంచే రూ.4 వేల పెన్షన్ అమలు చేస్తుంది. జూలైలో ఒకేసారి రూ.7 వేలు పెన్షన్ అందిస్తుంది. అమ్మ ఒడికి రూ.2 వేలు పెంచారు. ఒక్క పిల్లాడికి మాత్రమే ఇస్తారు. అదే కూటమి అయితే ఎంత మంది పిల్లలుంటే అన్ని రూ.15 వేలు ఇస్తారు. మహిళలకు రూ. 18,500 ఇస్తామంటున్నారు. అదే చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహలక్ష్మి పథకంలో 18 ఏళ్ల దాటిన మహిళలకు రూ.1,500 ఇస్తారు.

\- ఎంపీ రఘురామకృష్ణంరాజు

• కాపు నేస్తం కాదు.. దగా నేస్తం



వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో చూసి కాపు సామాజిక వర్గం నవ్వుకుంటున్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా రూ.10 వేల కోట్లు అందిస్తామని, గత ఎన్నికల్లో హామీ ఇచ్చి రూ.2 వేల కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. కాపునేస్తం పేరిట మహిళలకు రూ.15 వేలు ఇస్తానని, అనేక కోతలు విధించి కాపు సామాజిక వర్గాన్ని దెబ్బ తీశారు. 2004 ఎన్నికల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి కాపులను బీసీలుగా చేరుస్తారని హామీ ఇచ్చి మోసం చేశారు. కాపు కార్పొరేషన్‌ను ఈ ప్రభుత్వం అలంకార ప్రాయంగా మార్చింది.

\- ముత్యాల కామేష్, నూజివీడు

• మద్య నిషేధం ఏమైంది



వైఎస్ఆర్ చేయూతను వచ్చే ఐదేళ్ల కొనసాగిస్తామని, అమ్మ ఒడిని మరింత పెంచుతామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. గతంలో ఇచ్చిన హామీల్లో లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు అనేక కొర్రీలు విధించిన విషయం మహిళలు మర్చిపోలేరు. మద్య నిషేధం అమలు చేస్తానని ఇచ్చిన హామీ అమలు పరచకుండా మద్యం ధరలను విపరీతంగా పెంచి నాసి రకపు మద్యాన్ని అమ్ముతూ ఎంతో మంది మహిళల ఉసురును ఈ వైసీపీ ప్రభుత్వం తీసింది. మహిళలు ఎవరూ వైసీపీకి అండగా నిలిచేందుకు సిద్ధంగా లేరు.

\- ఎం.లక్ష్మీకాంతమ్మ, సర్పంచ్, బత్తులవారిగూడెం

• హామీలతోనే సరి..



న్యాయవాదుల సంక్షేమానికి ఎంతో చేస్తామని హామీలు ఇవ్వడంతోనే జగన్‌రెడ్డి సర్కార్ సరిపెట్టింది. వైఎస్సార్ 'లా' నేస్తం ద్వారా రూ.5 వేలు స్టైఫండ్ ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం న్యాయవాదులకు ఇవ్వాల్సిన రూ.100 కోట్లు ఇప్పటికీ చెల్లించలేదు. ప్రభుత్వం నుంచి రావాల్సిన డెత్ బెనిఫిట్స్‌ను చెల్లించకుండా న్యాయవాద కుటుంబాలను ఈ ప్రభుత్వం మోసగిస్తోంది.

\- డి.సూర్యనాథ్, అడ్వకేట్, నూజివీడు

సమర్థవంతంగా ఓటరు స్లిప్పుల పంపిణీ : కలెక్టర్

ఏలూరు సిటీ, ఏప్రిల్ 27 : సాధారణ ఎన్నికలకు సంబంధించి ప్రతి ఓటరుకు షెడ్యూలు ప్రకారం ఓటర్ స్లిప్‌లు (ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్) పంపిణీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులు, బీఎల్‌వోలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇంటింటికీ ఓటరు స్లిప్‌ల పంపిణీలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాల న్నారు. సంబంధిత ఓటరు స్లిప్‌లు ఆయా గ్రామాల్లో ఇంటింటికీ బీఎల్‌వోల ద్వారా అందజేస్తారన్నారు.



అధికారులతో సమావేశమైన ఎన్నికల వ్యయ పరిశీలకుడు భూటియా

అధికారులతో వ్యయ పరిశీలకుడి సమావేశం

ఉంగుటూరు,ఏప్రిల్ 27 : ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు షేరింగ్ జోర్డన్ భూటియా శనివారం ఉంగుటూరు ఆర్వో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సహాయ వ్యయ అధికారి, అకౌంటింగ్ టీంలతో సమావేశమయ్యారు. ప్రజా ప్రతినిధుల చట్టం1954 సెక్షన్ -77 ప్రకారం పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఎన్నికల ఖర్చు చేయకూడదన్నారు. ప్రతి అభ్యర్థి నామినేషన్ వేసిన తేదీ నుంచి ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల ఖర్చులకు సంబంధించి ప్రత్యేక ఖాతాను నిర్వహించాలని, వాటిని అకౌంటింగ్ నివేదికలు అందజేయాలన్నారు.



ఎన్నికల అబ్జర్వర్ రామన్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

చినవెంకన్న సేవలో ఎన్నికల అబ్జర్వర్ రామన్

ద్వారకా తిరుమల/ బుట్టాయగూడెం, ఏప్రిల్ 27: చినవెంకన్న ఆలయాన్ని ఎన్నికల అబ్జర్వర్ (తమిళనాడు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్) రామన్ శనివారం సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం ఆయనను అర్చకులు శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను అందించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

జంగారెడ్డిగూడెం బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పా టు చేసిన జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి శ్రీ రామన్ శనివారం పోలింగ్ బూత్‌లను పరిశీలిం చారు. బూత్‌ల వద్ద ఓటర్లకు ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించారు. ఓటర్లు స్వచ్ఛందంగా పోలింగ్ స్టేషన్లకు వచ్చి ఓట్లు వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి అధికారి ఎన్నికల నియమాలు తూ.చ. తప్పకుండా పాటించాలన్నారు.



ఈ-బైక్‌ను మడతపెట్టొచ్చు..

- విద్యుత్ బైక్‌ను రూపొందించిన ఏపీ నిట్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 27 : ఏపీ నిట్ విద్యార్థులు మడత పెట్టి పట్టుకెళ్లే ఈ-బైక్‌ను ఆవిష్కరించారు. ఏపీ నిట్ ఆచార్యులు డాక్టర్ టి.కార్తికేయశర్మ మార్గనిర్దేశంలో పలురువు విద్యార్థులు ఎలక్ట్రికల్ బైక్ (ఫ్లెక్సీపోల్ట్)కు రూపకల్పన చేశారు. సంస్థలో మెకానికల్ ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఎం.మనోజ్‌నాయక్, ఎం.అనిషా, కె.ప్రత్యూషా, కె.రాజేశ్వరి, కె.గణవరప్రసాద్ బృందంగా ఏర్పడి ఎలక్ట్రికల్ బైక్‌ను 20 రోజులు శ్రమించి రూపొందించారు. ఈ బైక్‌కు రెండు గంటలకు చార్జింగ్ పెడితే 18-20 కిలోమీటర్ల వేగంతో 25 కిలోమీటర్ల వరకూ సులభంగా ప్రయాణం చేయవచ్చని, 150 నుంచి 200 కిలోల బరువు వరకూ తట్టుకోగలదన్నారు. ఈ బైక్‌ను మడత పెట్టి కారులో పెట్టి ఎక్కడికైనా తీసుకు వెళ్ల వచ్చన్నారు. వాహనాలు లేని ప్రదేశాలలో నడవలేని వారికి ఈ బైక్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ వాహన రూపకల్పకు రూ.20 వేలు ఖర్చయ్యిందన్నారు. విద్యార్థులను, వీరికి సూచనలు ఇచ్చిన ఆచార్యులు డాక్టర్ కార్తికేయ శర్మను రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్ డాక్టర్ ఆర్‌కే.శాస్త్రి, డాక్టర్ జీబీ. వీరేష్‌కుమార్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.బాబూరావు ప్రత్యేకంగా అభినందించారు.

• ఆదర్శమూర్తికి నివాళి



ఆంధ్రజ్యోతి గ్రూపు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ సతీమణి వేమూరి కనకదుర్గ తృతీయ వర్ధంతి శనివారం జరిగింది. తాడేపల్లిగూడెం యూనిట్, ఏలూరు ప్రాంతీయ కార్యాలయాల్లో ఆమె చిత్రపటాలకు బ్రాంచ్ మేనేజర్ బి.హరిబాబు, ఎడిషన్ ఇన్‌చార్జ్ డి.రామకృష్ణ, ప్రొడక్షన్ ఆర్‌ఎం జి.శ్రీనివాస్, సర్క్యులేషన్ మేనేజర్ సీహెచ్ కృష్ణ, యాడ్స్ మేనేజర్ ఆర్‌బీ గోపాల కృష్ణంరాజు, ఏలూరు బ్యూరో జీవీఎస్ఎన్ రాజు, ఏబీఎన్ రిపోర్టర్ రాంబాబుతోపాటు వివిధ విభాగాల సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.



ఏలూరు సెంట్‌ఆన్స్ కాలేజీలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



సీఆర్ఆర్ పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి

పాలిసెట్‌కు 3,418 మంది హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 27 : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు శనివారం జరిగిన ఏపీ పాలీసెట్- 2024 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఏలూరులోని 11 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 4,055 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 3,418 మంది (84.3 శాతం) హాజరయ్యారని పరీక్షల జిల్లా కో-ఆర్డినేటర్ పి.సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ పరిశీలకుడు వై.ప్రసాదరావు, సెంటర్ కో-ఆర్డినేటర్ కందుల నాగేంద్ర వర ప్రసాద్ తెలిపారు. పరీక్షకు హాజరైన వారిలో బాలురు 2,119 మంది, బాలికలు 1,299 మంది ఉన్నారు. పాలిసెట్ నిర్వహణ తీరుని పరిశీలించేందుకు రాష్ట్ర సాంకేతికవిద్య శాఖ కమిషనర్ సీహెచ్.నాగరాణి పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్ష నిర్వహణపై సీఆర్ఆర్ పాలిటెక్నిక్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో రెండు ప్రభుత్వ, ఆరు ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలుండగా, వివిధ కోర్సుల్లో 3,280 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రవేశపరీక్ష ఫలితాలు తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మే 13న ప్రకటించాల్సి ఉంది. ఆ రోజున ఎన్నికల పోలింగ్ ఉన్నందున ఫలితాలు వాయిదాపడే అవకాశాలున్నాయి.



ఏలూరు సెంట్‌ఆన్స్ కాలేజీ పాలిటెక్నిక్ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు..

ముగిసిన డీఎల్ఎడ్ సెమిస్టర్ పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 27 : డీఎల్ఎడ్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన మూడో సెమిస్టర్ పరీక్షకు జిల్లాలో 63 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 59 మంది, మొదటి సెమిస్టర్ పరీక్షకు 51 మందికి 48 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, వీటితో ఈ పరీక్షలు ముగిశాయి.

29.300 కేజీల గంజాయి స్వాధీనం

- ఏలూరులో ఇద్దరు రైల్వే ప్రయాణికుల అరెస్టు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 27 : ఉన్నతాధికారులకు అందిన సమాచారంతో రైల్వే పోలీసులు ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేయగా ఇద్దరి వద్ద 29 కేజీల 300 గ్రాముల గంజాయి ఉండడంతో వారిద్దరిని అరెస్టు చేశారు. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. విజయవాడ రైల్వే ఎస్పీ చౌడేశ్వరికి అందిన సమాచారంతో ఆమె ఆదేశాల మేరకు విజయవాడ రైల్వే డీఎస్పీ డీవీఎస్ నాగేశ్వరరావు సూచనలతో విజయవాడ రైల్వే సీఐ పి.శ్రీనివాసరావు, ఏలూరు ఆర్పీఎం సీఐ బి శంకరరావు, రైల్వే ఏఎస్ఐ పి.సైమన్, ఆర్పీఎఫ్ ఎస్ఐ బి.ధనుష్, సిబ్బంది ఆకస్మికంగా శుక్రవారం ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులను తనిఖీలు చేపట్టారు. ప్లాట్‌ఫామ్ నెంబర్ 3లో కేరళ రాష్ట్రంలోని పాల్‌కడ్ జిల్లాకు చెందిన షఫీర్ సైఫుద్దీన్ (40), మహారాష్ట్ర రాష్ట్రం సోలాపూర్‌కు చెందిన శశికళ రమేష్ లోకహండే (44)ల వద్ద 29 కేజీల 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిద్దరిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

• ఎస్ఈబీ అధికారుల దాడులు



జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ఎస్ఈబీ బృందాలు దాడులు నిర్వహిం చాయి. జిల్లాలోని అనేక ప్రాంతంలో సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సారా, మద్యం, గంజాయి, నగదు అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా శనివారం జిల్లాలోని చింతలపూడి, భీమడోలు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు ఎస్ఈబీ పోలీస్ స్టేషన్ అధికారులు, చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది కలిసి ఈ దాడులు నిర్వహించారు. సారా తయారీ, విక్రయదారులపై ఐదు కేసులు నమోదు చేసి వారి నుంచి 70 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 2900 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసి మూడు కేసులు నమోదు చేశారు. డ్యూటీపెయిడ్ లిక్కర్ కలిగి ఉన్నవారిపై 14 కేసులు నమోదు చేసి 59.26 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఏఎస్పీ తెలిపారు.

జగన్మాయ

నియోజకవర్గ కేంద్రమైన తణుకు పారిశ్రామిక పట్టణంగా గుర్తింపు పొందింది. వైసీపీ ప్రభుత్వం పరిశ్రమలకు ప్రోత్సాహం, కార్మికుల సంక్షేమం గాలికొదిలేసింది. నియోజకవర్గంలో వేలాది కార్మికుల ఆరోగ్య సంరక్షణ నిమిత్తం ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు అంశం పాలకులకు పట్టదు. గత ప్రభుత్వం తణుకు ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా స్థాయి పెంచింది. తర్వాత వచ్చిన వైసీపీ పాలకులు జిల్లా ఆస్పత్రికి స్థల సేకరణ చేయకపోగా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో పరిశ్రమలతో పౌల్ట్రీ, వ్యవసాయం కీలకం. పౌల్ట్రీ రంగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. వేలాది ఎకరాలను ముంచుతున్న ఎర్ర కాల్వపై అక్విడెక్ట్ నిర్మాణాన్ని విస్మరించారు.


దువ్వలో వయ్యేరు కాలువ

పారిశ్రామిక తణుకు



జిల్లా కేంద్ర ఆస్పత్రి భవనం ఎక్కడ జగనన్నా

ప్రతిపక్ష నాయకుడిగా జగన్ పాదయాత్రలో తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి పది ఎకరాల భూమి సేకరణ హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందిస్తామన్నారు. కాలుష్య నిర్మూలనకు మాటిచ్చారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం వంటి హామీలు ఐదేళ్ల పాలనలో అమలుకు నోచుకోలేదు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన జగనన్న కాలనీలకు వెళ్లేందుకు కనీసం దారి కూడా లేదు.

- జిల్లా కేంద్ర ఆస్పత్రి భవన నిర్మాణంలో నిర్లక్ష్యం
- ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు గాలికొదిలేశారు
- టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించలేదు
- జగనన్న కాలనీలకు దారి లేదు
- ఎర్ర కాల్వ ముంపు నివారణ చర్యలు లేవు
- టీడీఆర్ బాండ్ల అవినీతికి అంకురార్పణ


జిల్లా ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన

(తణుకు)

తణుకు నియోజకవర్గ ప్రజలకు జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు, ముఖ్యమంత్రి అయ్యాక గాలికొదిలేశారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి పది ఎకరాల భూమి సేకరణ, టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించడం కాలుష్య నిర్మూలన, కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం వంటి హామీలు అమలుకు నోచుకోలేదు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కేంద్ర ఆసుపత్రిగా టీడీపీ ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆసుపత్రికి 10 ఎకరాల భూమి సేకరించాలని భావించారు. స్థల సేకరణలో పురోగతి లేదు కానీ భవన నిర్మాణానికి అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని శంకుస్థాపన చేశారు. జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

జగనన్న కాలనీల్లో సౌకర్యాలేవీ..?

జగనన్న కాలనీలకు పట్టణం, గ్రామాలకు దూరంగా భూసేకరణ చేసి స్థలాలు కేటాయించారు. లబ్ధిదారులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు, డ్రెయినేజీ, తాగునీరు వంటి సౌకర్యాలు లేవు. వర్షాకాలం కాలనీలు అన్నీ చెరువులను తలపిస్తున్నాయి. కాలనీల్లో కనీసం రహదారి నిర్మాణానికి గ్రావెల్ కూడా వేయలేదు. లే అవుట్‌కు అరకొర మట్టి తప్ప మరలా మట్టి వేసిన సందర్భాలు లేవు.

ఈఎస్ఐ ఆసుపత్రి ఎక్కడ?

పారిశ్రామిక పట్టణమైన తణుకులో కార్మికులకు అవసరమైన ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు కలగానే మిగిలింది. తణుకు పరిసర ప్రాంతాల్లో ప్రధానంగా ఆంధ్రా షుగర్స్, కెమికల్స్, అట్టల తయారీ, రాకెట్ ఇంధనం, పేపర్ల తయారీ పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. కేవలం డిస్పెన్సరీతోనే వారికి వైద్య సేవలందుతున్నాయి. ఆసుపత్రి నిర్మాణం హామీ కార్యరూపం దాల్చడం లేదు. కార్మికులకు వైద్యం అవసరమైతే రాజమహేంద్రవరం, విజయవాడ వెళ్లాల్సిన పరిస్థితి.

ముంచుతున్న ఎర్ర కాల్వ

ఎర్ర కాలువ ఏటా వేలాది ఎకరాలు ముంచుతోంది. దువ్వ, ముద్దాపురం, కొండేపాడు, కోనాల, సూర్యారావుపాలెం వంటి గ్రామాల్లో వరి చేలు ఏటా నీటమునుగుతున్నాయి. అక్విడెక్టు నిర్మాణం చేయడంలో ప్రజాప్రతినిదులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అన్ని చోట్ల కల్వర్టులు శిథిలావస్థకు చేరడంతో నీరు లీకేజీతో ముంపు ముప్పు తప్పడం లేదు.

కాలుష్య నివారణ ఒట్టిమాటే

తణుకు పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు ఎక్కువ కావడంతో కాలుష్యం కూడా ఎక్కువే. కాలుష్యం నివారణకు హామీ అమలు కాలేదు. గతంలో టిడిపి ప్రభుత్వంలోని పైడిపర్రు కాలువ వద్ద సంపు ఏర్పాటు చేసి అక్కడ నుంచి నరసాపురం వద్ద సముద్రంలో కలిపే విధంగా ప్రతిపాదించారు. జగన్ కాలుష్య నివారణ హామీ మరిచిపోయారు.

అందని గోదావరి జలాలు

పట్టణంలోని ప్రతి ఒక్కరికి గోదావరి జలాలు తాగునీరు అందిస్తామని చెప్పినా ఆచరణలో శూన్యం. పాలకొల్లు, నరసాపురం, నిడదవోలు, తణుకు పట్టణాలకు తాగునీరందించే విధంగా విజ్జేశ్వరం వద్ద రూ.220 కోట్లతో నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు పనుల్లో పురోగతి లేదు.

నెరవేరని హామీలు

- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతం ఇస్తామన్న జగన్ హామీ సీఎం అయ్యాక గాలికొదిలేశారు.
- ఎస్సీబిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టేడియం నిర్మాణంపై ఎమ్మెల్యే కారుమూరి హామీ అమలు కాలేదు.
- పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రోడ్లు విస్తరణ చేస్తామని హామీ అమలు కాలేదు. పట్టణంలో ప్రధాన సమస్య ట్రాఫిక్.
- నియోజకవర్గంలో రహదారులన్నీ గోతులమయం. గ్రామాల్లో రోడ్డు నిర్మాణం చేపట్టిన దాఖలాలు లేవు.
- తణుకు సంత మార్కెట్‌లో గత ప్రభుత్వం ఆధునిక చేపల మార్కెట్ నిర్మాణం చేపట్టింది. తర్వాత ఐదేళ్లలో కేవలం ఫినిషింగ్ పనులు, విద్యుత్, నీటి సౌకర్యాలు కల్పించలేకపోయారు.
- వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పనులు మధ్యలోనే ఆగిపోయాయి. బాలురున్నత పాఠశాల్లో నిర్మించిన ఇండోర్ స్టేడియం నిర్మాణాలు కూడా మధ్యలో నిలిచిపోయాయి.

టీడీఆర్ కుంభకోణం

టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి మంత్రి కారుమూరి తణుకులో అంకురార్పణ చేశారని ఆరోపణ. సుమారు రూ.300 కోట్లు కుంభకోణం బయట పడింది తణుకులోనే. మాస్టర్ ప్లాన్ ప్రకారం పట్టణంలో గ్రీనరీ ఏర్పాటుకు 20ఎకరాలు భూమిని తీసుకుని ఎకరాల్లో ఉన్న భూమిని గజాల్లోకి మార్చి గజం ధర ప్రకారం రేటు కట్టించి టీడీఆర్ బాండ్లు పొందారు. ఒకటికి నాలుగు రెట్లు చొప్పున బాండ్లను తీసుకొని కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారు.

జగనన్న కాలనీ భూసేకరణలో అవినీతి ఆరోపణలు వచ్చాయి. రైతుల నుంచి తక్కువ ధరకు భూమి కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అంచనా చూపించారనే ఆరోపణలు ఉన్నాయి.

శిథిలమవుతున్న టిడ్కో ఇళ్లు



టీడీపీ ప్రభుత్వం 90 శాతం నిర్మించిన టిడ్కో ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు ఇస్తామని హామీ ఇచ్చిన వైసీపీ అధికారంలోకి వచ్చాక మోసం చేసింది. అసంపూర్తి నిర్మాణాన్ని పట్టించుకోలేదు. లబ్ధిదారులు అధిక వడ్డీలకు తెచ్చి రూ.50వేలు నుంచి రూ.1.5 లక్షలు చెల్లించారు. అయినప్పటికీ లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించ లేదు. బ్యాంకు రుణాల వాయిదాలు చెల్లించాల్సి వస్తోంది.

ఎన్నికల్లో అధికారులే కీలకం

ఐదేళ్లకోసారి జరిగే సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడంలో అధికారుల పాత్ర కీలకం. ఒక జిల్లాలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ అధికారులు పాత్ర పోషిస్తారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రధాన ఎన్నికల అధికారి చీఫ్ ఎలక్టోరల్ అధికారిని సంప్రదిస్తుంది. ఆ అధికారి పర్యవేక్షణలోనే ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. ఈనేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో పనిచేసే అధికారులు వివరాలు.

జిల్లా ఎన్నికల అధికారి

ప్రధాన ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ప్రతి జిల్లా ఎన్నికల అధికారి ఉంటారు. పాలనాధికారి (కలెక్టర్) ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమలు చేయడంలో కలెక్టర్ ప్రధాన పాత్ర పోషిస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తారు.

రిటర్నింగ్ అధికారి (ఆర్వో)

ఎన్నికల నిర్వహణకు కేంద్రం రిటర్నింగ్ అధికారిని నియమిస్తుంది. ఈ అధికారి సంబంధిత నియోజకవర్గాలను పర్యవేక్షిస్తారు. నామినేషన్ ప్రక్రియ తుది జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, ఓట్లు లెక్కింపు ఫలితాల వెల్లడి వంటి అంశాలు ఆర్వో పర్యవేక్షణలోనే జరుగుతాయి.

సెక్టోరియల్ అధికారి

8-10 పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించడానికి సెక్టోరియల్ అధికారులను నియమిస్తారు. ఆయా బూత్‌ల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. అవసరమైతే పరిస్థితులకు అనుగుణంగా ఆయా చోట్ల 144 సెక్షన్ విధించే అధికారి ఆయనకే ఉంటుంది.

ఓటర్ల నమోదు అధికారి

ఓటర్ల నమోదు అధికారి ప్రతి నియోజకవర్గ స్థాయిలో ఉంటారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు జాబితాలో పేర్లు, ఫోటోలు తప్పుగా ఉన్నవారంతా ఆయనను సంప్రదించాలి. ఆయన పర్యవేక్షణలోనే సిబ్బంది ఓటర్ల జాబితాను తయారు చేస్తారు.

ప్రిసైడింగ్ అధికారి

ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు బూత్‌లకు తీసుకువచ్చి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించి తిరిగి వాటిని స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చేవరకూ వీరిదే బాధ్యత. వీరితో పాటు సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని కార్యకలాపాలు పీవో పర్యవేక్షణలో జరుగుతాయి.

సూక్ష్మపరిశీలకులు

ఎన్నికలు జరిగిన తీరు, పర్యవేక్షణపై నివేదిక రూపొందించి కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించడానికి సూక్ష్మపరిశీలకులను ఏర్పాటు చేస్తారు. ప్రతి మండలానికి ఒకరు ఉంటారు. వారంతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

బూత్ లెవల్ అధికారి (బీఎల్వో)

ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ అధికారి ఉంటారు. కొత్తగా ఓటరు జాబితాలో చేరే వారికి ఫాం 6, తొలగింపునకు ఫాం 7, తప్పులు సవరణకు అవసరమైన ఫారాలు ఇవ్వడం, అర్హులైన వారంతా ఓటు నమోదు చేసుకునేలా చూడడం, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదించడం, ఓటర్ల జాబితా ప్రదర్శన, కేంద్రాల్లో మార్పులకు బీఎల్వోలు పనిచేస్తుంటారు.


- అత్తిలి

ఓటేశారా.. ఇలా చూసుకోండి



పోలింగ్ రోజున ఈవీఎంలో మనం ఏ అభ్యర్థికి ఓటు వేశామో వెంటనే చూసుకోవచ్చు. మనకు నచ్చిన అభ్యర్థికి వేసిన ఓటు సక్రమమేనా లేక క్రాస్ అయిందా అనే అనుమానాన్ని నివృత్తి చేసుకునే అవకాశాన్ని ఎలక్షన్ కమిషన్ కల్పించింది. ఓటరు వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీప్యాట్) ద్వారా ఈ అవకాశాన్ని కల్పించారు. వేసిన ఓటును చూసుకునే అవకాశం ఏడు సెకండ్ల సమయం వరకు మాత్రమే ఉంటుంది. అనంతరం ఆ ఓటు వీవీ ప్యాట్ బాక్స్‌లో పడిపోతుంది. బ్యాలెట్ యూనిట్‌లో ఓటు వేయగానే మనం వేసిన ఓటు పేపర్‌పై ప్రింట్ అవుతుంది. దానికి అనుసంధానంగా వీవీప్యాట్‌లో ఆ పేపర్ మనకు కనిపిస్తుంది. - ముదినేపల్లి

ఓటేయడానికి గుర్తింపు కార్డులు



పోలింగ్ రోజు ప్రతి ఓటరు విధిగా వ్యక్తిగత గుర్తింపు కార్డు తీసుకువెళ్లాలి. లేకుంటే ఎన్నికల అధికారులు ఓటును తిరస్కరించే అవకాశం ఉంది. ఓటరు అందుబాటులో ఉన్న గుర్తింపు కార్డును తీసుకువెళితే కుదరదు. ఎన్నికల సంఘం 11 రకాల గుర్తింపు కార్డులు మాత్రమే ఎన్నికల అధికారులు పరిగణనలోకి తీసుకుంటారు. ఓటరు ఫోటో గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, సర్వీసు గుర్తింపుకార్డు (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు తమ ఉద్యోగులకు జారీ చేసినవి), పాస్‌బుక్ (ఫోటోతోపాటు బ్యాంక్, పోస్టాఫీస్ జారీ చేసినవి), పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, స్మార్ట్‌కార్డు (కార్మిక మంత్రిత్వ శాఖ పథకంలో జారీచేసినవి), ఉపాధి జాబ్ కార్డు, ఆరోగ్యబీమా స్మార్ట్‌కార్డు, ఫోటో పింఛన్ పత్రం, అధికారిక గుర్తింపుకార్డు (ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేసినవి) - అత్తిలి



ప్రచారం.. గీత దాటొద్దు

నామినేషన్ల ప్రక్రియ దాదాపు ముగియడంతో ప్రచారం తానస్థాయికి చేరుకుంది. అభ్యర్థులు, వారి తరఫున నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తే ఎన్నికల కమిషన్ కొరడా ఝళిపిస్తుంది. ప్రచారం హద్దు మీరకుండా గీత గీసింది.

- ప్రచార వాహనానికి రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి. అనుమతి పొందిన వారే ఆ వాహనాన్ని వాడాలి.
- విద్యా సంస్థల్లో ఎన్నికల ప్రచారం చేయకూడదు.
- కరపత్రాలపై ముద్రణాలయాల పేరు, చిరునామా ఉండాలి.
- ప్రచారంలో కార్యకర్తలకు ఇచ్చే టోపీలు, కండువాల ఖర్చులో ఎన్నికల వ్యయంలో చూపించాలి.
- ప్రార్థనా స్థలాలు, పాఠశాలలు, పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల ఎన్నికల ఆఫీసులు ఉండకూడదు.
- రాత్రి పది గంటల తర్వాత ఉదయం 6 గంటల లోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు.
- వాహనాలపై మతపరమైన ఫొటోలు ఉండకూడదు.

- ముదినేపల్లి



ఎన్నికల కళ

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రచారంలో తలమునకలుగా ఉన్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు కళా బృందాలతో గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. రాజకీయ ప్రసంగాలు, విమర్శలు, ప్రతి విమర్శలతో హామీలు, అమలు చేసే సంక్షేమ పథకాలు, చేపట్టనున్న అభివృద్ధి పథకాల ప్రజలకు చేరేవిధంగా కళలతో ఆకట్టుకుంటున్నారు.

అమ్మవార్ల ఉత్సవాలను తలపించేవిధంగా కళా రూపాలతో ప్రజల ముందుకు వెళుతున్నారు. తీన్‌మార్, తప్పెటగుళ్లు, బ్యాండ్ మేళం, గాయనీ, గాయకుల బృందాలు, బుట్టబొమ్మలతో వినూత్న ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలతో కళాకారులకు తాత్కాలిక ఉపాధి లభించింది.

ఏలూరు కల్చరల్, గణపవరం



మా ఓటు మాటేమిటి సార్!

ఎన్నికల విధుల్లో వీడియోగ్రాఫర్లు

ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ నేతలపై ఎన్నికల సంఘం నిఘా వేసింది. అందుకు అధికారులూ ఉన్నారు. ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లతో ఎన్నికల ప్రచార శైలిపై ఫొటోలు, వీడియోలు తీయిస్తున్నారు. ఎన్నికల అధికారుల వెంట ఉండే ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉందా..? నియోజకవర్గానికి సుమారు 70 మంది వీడియోగ్రాఫర్లను ఎన్నికల అధికారులు పనిలో ఉంచుకున్నారు. వారంతా ఓటుహక్కు వదులుకునే పరిస్థితి కనిపిస్తుంది. ఎన్నికల కమిషన్ ఈ సారి జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు అవకాశం కల్పించింది కదా ఆ కోటాలో పోస్టల్ బ్యాలెట్ వేసుకోవచ్చు కదా అని ఆశించారు. కానీ పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తుచేసుకునేందుకు గడువు ముగియడం, ఐడీకార్డులు జారీ చేయకపోవడంతో ఈ సారికూడా తమ ఓటుహక్కు వినియోగించుకోలేక పోతున్నామని వీడియోగ్రాఫర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం, ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఊదరగొట్టే అధికారులు తమ వెంట ఉండే సిబ్బంది, పనిలో ఉన్నవారందరితో ఓటు వేయిస్తారో.. లేదో?

- తాడేపల్లిగూడెం రూరల్



అమ్మో.. ఫోన్ కాల్

ఎన్నికల ప్రచారంతో చేతిలో ఫోన్‌తో చికాకే. మాటి మాటికి రాజకీయ నేతలు, పోటీలో ఉన్న అభ్యర్థుల ఫోన్ కాల్స్, రికార్డెడ్ వాయితో విసిగిస్తున్నారు. ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల ద్వారా ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్ర అభ్యర్థుల ప్రచారం కూడా తోడైంది. నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు సెల్ ఫోన్లలో వాయిస్ కాల్స్ ద్వారా ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నేను ఫలానా పార్టీ అభ్యర్థిని, నా ఎన్నికల గుర్తు ఫలానా అని చెబుతున్నారు. మీకు అందుబాటులో ఉండి సేవలందిస్తా.. మీ ఓటు వేసి నన్ను గెలిపించండి అంటూ ఫోన్లలో మోత మోగిస్తున్నారు. వాట్సాప్ మెస్సేజ్‌లు, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మెస్సేజ్‌లతో కూడా ప్రచారం చేస్తున్నారు. ఫోన్ వాయిస్ కాల్స్ ఎక్కువగా వస్తున్నాయి. - ముదినేపల్లి



రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలే..

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ నేతలు ఆచితూడి మాట్లాడాలి. ఏమైనా తేడా పాడా మాట్లాడి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారా ఊచలు లెక్కబెట్టాలి. తస్మాత్ జాగ్రత్త. కొందరు అభ్యర్థులు కులం, వర్గం, మతం, ప్రాంతం పేరుతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలను అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం నియమావళిలో కఠిన నిబంధనలు రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మత, కుల, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఆర్పీ చట్టం 1951 సెక్షన్, 125 ఐసీసీ సెక్షన్, 153ఎ ఐపీసీ ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ఓటు కోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్న వారిని కూడా నేరస్తులుగా పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్ 171బి, 171ఇ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రస్తుత ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రవాహంపై నిఘా పెంచారు. నజారాలకు లొంగిన ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా భారీ మూల్యం చెల్లించకతప్పదు. - అత్తిలి

అప్పుడు ప్రత్యర్థులు..ఇప్పుడు మిత్రులు



తాడేపల్లిగూడెంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ ఇప్పటి వరకూ ఆరుసార్లు సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రస్తుతం ఏడో సారి బరిలో నిలిచారు. తాను పోటీచేసిన సమయంలో తనకు ప్రత్యర్థులుగా నిలిచిన ఈలి నాని, పసల కనకసుందరంలు ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో చేరి ఆయనకు మిత్రులుగా వ్యవహరిస్తున్నారు. **- తాడేపల్లిగూడెం రూరల్**

రేపు పవన్ కల్యాణ్ పర్యటన



తాడేపల్లిగూడెం అర్బన్/ గణపవరం ఏప్రిల్ 27 : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29వ తేదీ సోమవారం తాడేపల్లిగూడెంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన ఉంటుందని విజయవంతం చేయాలని నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పిలుపునిచ్చారు. పట్టణంలోని గొల్లగూడెం సెంటర్ రామాలయం వద్ద సాయంత్రం 5.30 గంటలకు పవన్‌కల్యాణ్ బహిరంగ సభ జరుగుతుందన్నారు. తాడేపల్లిగూడెం నుంచి పిప్పర మీదుగా గణపవరం చేరుకుంటారని జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పచ్చమట్ల ధర్మరాజు తెలిపారు. గణపవరం సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీ శ్రేణులతో పాటు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జనసేన నియోజకవర్గ పరిశీలకుల నియామకం



మల్లినీడి తిరుమలరావు

భీమవరం టౌన్, ఏప్రిల్ 27 :జనసేన పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులను పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నియమించారని జనసేన రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున నియమించామన్నారు. ఆయా నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వాన్ని సమన్వయం చేసుకుని పార్టీ గెలుపుకోసం విస్తృతంగా కృషి చేస్తారని తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి మల్లినీడి తిరుమలరావు, కిరణ్ రాయల్‌ను నియమించారు. భీమవరం నియోజకవర్గానికి బోనబోయన శ్రీనివాసయాదవ్, భవానీ రవికుమార్‌లను, నరసాపురం నియోజకవర్గానికి బండ్రెడ్డి రామకృష్ణ, ఘంటశాల వెంకటలక్ష్మిలను నియమించారు. ఉంగుటూరుకు గడపాల అప్పారావు, పీవీఎస్ఎన్ రాజులను నియమించారు.



కాపవరంలో ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎంఎంసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

అమ్మకాల్లో వ్యత్యాసాలుంటే చర్యలు

ఎంఎంసీ, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు

ఆకివీడు, ఏప్రిల్ 27: నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎంఎంసీ, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు వై.రామకృష్ణ, శ్రీకర్ హెచ్చరించారు. శనివారం స్థానిక కాపవరం రోడ్‌లోని దానమ్మ దేవాలయం సమీంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తనిఖీ చేశారు. దుకాణంలో అమ్మకాలు అధికంగా జరిగినట్లు రికార్డులో ఉండడంపై అడగ్గా సమీపంలో పెండ్లి జరగడంతో తీసుకెళ్లారని దుకాణదారులు తెలిపారు. అమ్మకాల్లో వ్యత్యాసాలు ఉండకూడదన్నారు. వీరి వెంట ఏఎస్ఐ సత్యనారాయణ, కానిస్టేబుల్ సూర్యనారాయణ, పండు ఉన్నారు.



లంకగ్రామాల్లో పోలింగ్ కేంద్రాల పరిశీలనకు పడవపై వెళుతున్న ఎస్పీ డాక్టర్ అజిత

అయోధ్యలంకలో పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆచంట, ఏప్రిల్ 27: జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత ఆచంట మండలం అయోధ్యలంకలో పోలింగ్ కేంద్రాలను శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఎస్పీ కరుగోరుమిల్లి నుంచి గోదావరిపై పడవ ప్రయాణం చేసి అయోధ్యలంక వెళ్లారు. మర్రిమూలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, అయోధ్యలంకలోని అంగన్‌వాడీకేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు తీసుకోవాల్సిన భద్రతా పరమైన చర్యలు గురించి పోలీసు అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. స్థానికులతో మాట్లాడి శాంతి యుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి పోలీసులకు సహకరించాలన్నారు. పెనుగొండ సీఐ రజనీ కుమార్, ఎస్.ఎం రాజ్‌కుమార్ ఉన్నారు.



ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని సెంటిమెంటుగా తీసుకుంటారు. ఈ నియోజకవర్గం జిల్లా రాష్ట్ర రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఇక్కడ ఏ పార్టీ గెలుపు సాధిస్తే ఆ పార్టీయే రాష్ట్ర రాజకీయాలను శాసించి అధికార పీఠం ఎక్కుతుందనే సెంటిమెంటు కూడా ఉంది. 1967లో ఏర్పాటైన ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 11 సార్లు ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్-ఐ ఐదుసార్లు సార్లు, తెలుగుదేశం ఐదు సార్లు, వైసీపీ ఒకసారి విజయం సాధించాయి. మెట్ట ప్రాంతానికి ముఖద్వారంగా ఉండే భీమడోలు ఒక వైపు, డెల్టా ప్రాంతానికి ఆరంభంగా ఉండే నారాయణపురం మరోవైపు ఉన్నాయి. విభిన్న సంస్కృతుల కలయికతో విభిన్న ప్రాంతాల ప్రజల రాజకీయ చైతన్యానికి వారధిగా ఉంది. మెట్టప్రాంత ప్రజల ఆలోచనలు, డెల్టా ప్రాంత రాజకీయ చతురత, కొల్లేటి గ్రామాల ఐక్యత మిశ్రమంగా ఉంగుటూరు నియోజకవర్గం నిలబడుతోంది. - నిడమర్రు

ఫ్లాష్ బ్యాక్



గణపవరం సెంటర్

అటు మెట్ట..ఇటు డెల్టా

వేంగీ చాళుక్యుల పాలన కాలం నుంచి ఈ ప్రాంతానికి ఎంతో ఆర్థిక పరిపుష్టి ఉండేది. తర్వాత రాజరాజనరేంద్రుడు పాలనలో సాహిత్య రంగంలో ఈ ప్రాంత కవులు ఎన్నో సాహితీ శిఖరాలు అధిరోహించారు. నూజివీడు సంస్థానం నుంచి బ్రిటిష్ పాలనలోకి వెళ్లిన ఈ ప్రాంతం 1925 ఏప్రిల్ 15న పశ్చిమ గోదావరి జిల్లాగా ఏర్పాటు చేయబడింది. మెట్ట ప్రాంతానికి చెందిన భీమడోలు, ఉంగుటూరుతో పాటు డెల్టా ప్రాంతానికి చెందిన నిడమర్రు, గణపవరం మండలాలతో 81 గ్రామ పంచాయతీలతో ఈ నియోజవర్గం విభిన్నంగా ఉంటుంది. ఆటు కొల్లేరు సరస్సు పక్షుల కిలకిలలు.. మెట్టప్రాంతంలో మామిడి, కొబ్బరి, పామాయిల్ తోటలతో ఉద్యాన వనాలను తలపిస్తాయి. ఇటు డెల్టా ప్రాంతంలో ప్రవేశిస్తే పచ్చని తివాచీ పరుకున్నట్టు ఉండే వరిసాగు పచ్చని గోదావరి అందాలను అడుగడునా ఆహ్లాదపరుస్తాయి.



ఒకవైపు కొల్లేరు కిలకిలలు
మెట్ట, డెల్టా ప్రాంతాల సమ్మిళతం
రాష్ట్ర రాజకీయాల్లో ఉంగుటూరుకు ప్రాధాన్యం



నియోజకవర్గం : ఉంగుటూరు
రెవెన్యూ గ్రామాలు : 81.
మండలాలు : భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం
పార్లమెంటరీ నియోజకవర్గం : ఏలూరు
ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు : 12
మొత్తం ఓటర్లు : 2,05,194
పురుషులు : 1,01,020
స్త్రీలు : 1,04,168
ఇతరులు : 6

ఏకగ్రీవ ఎమ్మెల్యే మూర్తిరాజు

ఉంగుటూరు నియోజకవర్గ చరిత్రలో ఏకగ్రీవంగా గెలుపొందిన ఏకైక ఎమ్మెల్యేగా చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు ఘనత సాధించారు. 1967లో వట్టి పార్థసారధిపై గెలుపొందిన తర్వాత విద్యాశాఖమంత్రిగా చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఎన్నో విద్యాసంస్థలు నెలకొల్పారు. 1972లో ఆయనకు ఎదురుగా పోటీ చేయడానికి ఎవరు ముందుకు రాకపోవడంతో మూర్తి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నియోజవర్గంలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాలకు చెందిన 81 గ్రామాలు ఉన్నాయి. నియోజవర్గంలో అత్యధిక ఓటర్లు గల మండలం ఉంగుటూరు. ఉంగుటూరు, భీమడోలు మండలాలలో మెజారిటీ సాధిస్తే ఆటోమేటిక్‌గా విజయం ఖాయమని కార్యకర్తలు చెబుతుంటారు. ఇక్కడ మెజారిటీ పొందిన పార్టీ నియోజవర్గాన్ని శాసించగలదని నాయకులు విశ్వాసం. నియోజకవర్గంలో పురుష ఓటర్లు కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండడంతో నాయకులు మహిళామణులను మచ్చిక చేసుకోవడానికి రకరకాల మార్గాలు అన్వేషిస్తుంటారు.

రెండు సార్లు గెలుపు గుర్రాలు వీరే

ఉంగుటూరు నియోజవర్గం 1967లో ఏర్పడింది. రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు ఈ నియోజకవర్గం. తెలుగుదేశం పార్టీ కంచుకోటగా భావిస్తుంటారు ఉంగుటూరు నియోజక వర్గంలో రెండు సార్లు గెలుపొందిన వారు నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. చింతలపాటి మూర్తిరాజు 1967, 1972 లలో కాంగ్రెస్ తరపున గెలుపొందగా, తర్వాత కంఠమనేని శ్రీనివాసరావు 1983, 1985లలో ఇండిపెండెట్‌గా, తర్వాత టీడీపీ తరపున గెలుపొందారు. కొండ్రెడ్డి విశ్వనాథం 1994, 1999లలో తెలుగుదేశం తరుపున పోటీ చేసి విజయకేతనం ఎగురువేశారు. వట్టి వసంతకుమార్ 2004, 2009లలో కాంగ్రెస్ తరపున గెలుపొందారు.

మంత్రి పదవులు పొందిన ఎమ్మెల్యేలు

నియోజవర్గం ఏర్పడిన తొలి రోజులలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన గాంధేయవాది, సర్వోదయ మండలి నాయకులు చింతలపాటి మూర్తిరాజు విద్యాశాఖ మంత్రిగా పని చేసి ఎన్నో విద్యాలయాలను, కళాశాలలను నెలకొల్పారు. తదుపరి వట్టి వసంత్ కుమార్ టూరిజం మంత్రిగా పనిచేశారు.

తొలి శాసన సభ్యుడు మూర్తిరాజు

1967లో ఏర్పాటైన ఉంగుటూరులో తొలిసారి ఇందిరా కాంగ్రెస్ తరపున చింతలపాటి వర ప్రసాద మూర్తిరాజు వట్టి వెంకట రంగ పార్ధ సారధిపై 4,006 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 1972లో మూర్తిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1978లో జనతా పార్టీ అభ్యర్థి మాగంటి భూపతిరావుపై కడియాల సత్యనారాయణ 17,375 ఓట్ల మెజా రిటీతో విజయం సాధించారు. 1983లో తెలుగుదేశం ప్రభంజ నంతో కంఠమణి శ్రీనివాసరావు కాంగెస్ అభ్యర్థి చింతలపాటి వరప్రసాద మూర్తిరాజుపై 25,180 ఓట్ల మెజారిటీ విజయం సాధించారు. 1985 (నాదెండ్ల బాస్కర రావు సంక్షోభంలో ఇదే నియోజకవర్గం నుంచి)లో దశక లక్ష్మణ శాస్త్రిపై కంఠమణి శ్రీనివాసరావు 29,519 ఓట్లతో విజయం సాధించారు. 1989లో చావా రామకృష్ణారావు (కాంగ్రెస్)కంఠమణి శ్రీనివాసరావుపై 20,104 ఓట్లతో విజయం సాధించారు.1994లో కొండ్రెడ్డి విశ్వనాథం (తెలుగుదేశం) చావా రామకృష్ణారావుపై 18,862 ఓట్ల మెజారిటీ సాధించారు. 1999లో చావా రామకృష్ణారావు (కాంగ్రెస్)పై తిరిగి కొండ్రెడ్డి విశ్వనాథం విజయం సాధిం చారు. 2004లో వట్టి వసంత కుమార్ (కాంగ్రెస్) ఇమ్మణి రాజేశ్వరిపై 15,661 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి తొలిసారి రాష్ట్ర మంత్రి అయ్యారు.2009లో వట్టి వసంత కుమార్ గన్ని లక్ష్మీకాంతం (తెలుగుదేశం)పై 6,459 ఓట్ల మెజారిటీతో విజయం సాధించగా ఇదే సెగ్మెంటులో కొత్తగా (ప్రజారాజ్యం) నుంచి కోటగిరి విద్యాధరరావు కూడా పోటీ చేశారు. 2014లో గన్ని వీరాంజనేయులు (తెలుగుదేశం) తన వైసీపీ అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావుపై 8,930 ఓట్ల మెజా రిటీతో విజయం సాధించారు. 2019లో వైస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావు గన్ని వీరాంజనేయులపై 33,153 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.



పెదవింద్రకొలనులో గాంధీ భవనం

సర్వోదయ సమ్మేళనంతో దేశవ్యాప్త చర్చ

భూదానోద్యమ ఫలితంగా అప్పటి మంత్రి చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు నాచుగుంటలో అఖిల భారత సర్వోదయ సమ్మేళనం 1965 ఏప్రిల్ 14,15,16 తేదీలలో నిర్వహించారు. అప్పటి రాష్ట్రపతి, పలువురు దేశ నాయకులు పాల్గొనడంతో ఇక్కడి ప్రాంతానికి సర్వోదయ నగర్‌గా సుంకవల్లి వరప్రసాదరావు పేరు పెట్టుకుని నివాసం ఏర్పరచుకున్నారు.



సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
1967	చింతలపాటి వరప్రసాదమూర్తిరాజు	కాంగ్రెస్	వట్టి పార్థసారధి	ఇండిపెండెట్	4,006
1972	చింతలపాటి వరప్రసాదమూర్తిరాజు	కాంగ్రెస్			ఏకగ్రీవం
1978	కడియాల సత్యనారాయణ	కాంగ్రెస్	మాగంటి భూపతిరావు	జేఎన్‌పీ	16,732
1983	కంఠమనేని శ్రీనివాసరావు	ఇండిపెండెట్	చింతలపాటి మూర్తిరాజు	కాంగ్రెస్	25,180
1985	కంఠమనేని శ్రీనివాసరావు	టీడీపీ	దశిక లక్ష్మణ శాస్త్రి	కాంగ్రెస్	29,519
1989	చావా రామకృష్ణారావు	కాంగ్రెస్	కంఠమనేని శ్రీనివాసరావు	టీడీపీ	20,104
1994	కొండ్రెడ్డి విశ్వనాథం	టీడీపీ	చావా రామకృష్ణారావు	కాంగ్రెస్	18,862
1999	కొండ్రెడ్డి విశ్వనాథం	టీడీపీ	చావా రామకృష్ణారావు	కాంగ్రెస్	3,302
2004	వట్టి వసంత్ కుమార్	కాంగ్రెస్	ఇమ్మణి రాజేశ్వరి	టీడీపీ	15,719
2009	వట్టి వసంత్ కుమార్	కాంగ్రెస్	గన్ని లక్ష్మీ కాంతం	టీడీపీ	6,459
2014	గన్ని వీరాంజనేయులు	టీడీపీ	పుప్పాల శ్రీనివాసరావు	వైసీపీ	8,930
2019	పుప్పాల శ్రీనివాసరావు	వైసీపీ	గన్ని వీరాంజనేయులు	టీడీపీ	33,153



ఎన్నికల ఖర్చంతా వీఆర్వోలపైనే



అప్పు చేసి ఖర్చులు భరిస్తున్నాం..
ఎన్నికలయ్యాక చేతికందని నగదు
గత ఎన్నికల్లో పరిస్థితి ఇదే..
ఆదుకోవాలంటూ ఈసీకి విజ్ఞప్తి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 27: సాధారణంగా ఎన్నికల ఖర్చుకు సంబంధించిన డబ్బును, ఆర్వోలు, వీఆర్వోలు, ఏఈఆర్వోలు విడుదల చేస్తుంటారు. ఆర్వోల నుంచి ఏఈఆర్వోలు, వీఆర్వోలకు సొమ్ము విడుదలవుతుంటుంది. వీరిలో సాధారణంగా తహసీల్దార్లే ఉంటారు. తహసీల్దార్లు తిరిగి ఆర్ఐలకు పనులు పురమాయిస్తారు. ఆర్ఐలు ఆ పనులను వీఆర్వోలపై పెడతారు. అంతిమంగా ఆ ఖర్చు వీఆర్వోల మెడకు చుట్టుకుంటుంది. చాలాచోట్ల వీఆర్వోలు, బీఎల్‌వోలుగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వీరంతా రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. ఇందుకోసం అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం నుంచి నిధులు ఏమీ రాకపోవడంతో ఎన్నికలు అయ్యే వరకు ఓపిక పట్టాలని, అప్పులు ఇచ్చిన వారిని బతిమిలాడుకుంటున్నారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమయ్యే స్టేషనరీ, పేపర్ బండిల్స్, దరఖాస్తులు, ప్రింటింగ్ కాపీలు, ఎలక్టోరల్ రోల్స్, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, ర్యాంపులు, కేంద్రాల్లో పరిశుభ్రత..ఇవన్నీ వీఆర్వోలే చూసుకోవాలి. జిల్లా ఎన్నికల అధికారి, ఆర్వోలు వస్తే ప్రొటోకాల్ ప్రకారం వారి ఖర్చులన్నీ భరించాలి. పోలింగ్ సమయంలో భారీగా ఖర్చు ఉంటుంది. ఒక్కో మండలానికి సగటున 60 పోలింగ్ కేంద్రాలు ఉంటాయనుకుంటే ఒక్కో కేంద్రానికి 12 మంది సిబ్బంది ఉంటారు. అన్ని పోలింగ్ స్టేషన్‌లకు అల్పాహారం, భోజనాలు, స్నాక్స్, మజ్జిగ వంటివి ఏర్పాటు చేయాలి. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలకు చేరుకునే సిబ్బందికి అల్పాహారాలు, భోజనాలు పెట్టాలి. ఇలా లక్షల రూపాయలను ఖర్చుచేసినా చివరకు ఆ డబ్బు చేతికి అందక వీఆర్వోలు ప్రతి ఎన్నికల్లో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఎన్నికల సందర్భంలో ఇతర జిల్లాల తహసీల్దార్లు బదిలీపై వస్తుంటారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన డబ్బు వీరు తీసుకు వెళ్లిపోతూ ఉండటంతో వీఆర్వోలు నిండా మునిగిపోతున్నారు. గత ఎన్నికల్లోనూ ఇదేతంతు జరిగింది. ఎన్నికల్లో ఎవరైతే డబ్బు ఖర్చుపెడతారో వారికే ఎన్నికల సంఘం డబ్బులు ఇవ్వాలని వీఆర్వోలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పడిన ఇబ్బందులు, ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలను వీఆర్వోల సంఘ నాయకులు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లారు.

బీఎల్‌వోలకు గౌరవ వేతనం లేదు



ప్రస్తుతం పనిచేస్తున్న గత బీఎల్‌వోలకు గత రెండేళ్ల నుంచి గౌరవ వేతనం ఇవ్వలేదు. ఆ నిధులు తక్షణం విడుదల చేయాలి. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాం. రాష్ట్రంలో జరిగే సాధారణ ఎన్నికల్లో ఉద్యోగు లంతా ఓటుహక్కు వినియోగించుకోవడానికి అవకాశం కల్పిం చాలి. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు అందరికి ఆ నియోజకవర్గంలో ఓటుహక్కు వినియోగానికి రిటర్నింగ్ అధికారి పరిధిలో చర్యలు తీసుకోవాలి.

-భూపతిరాజు రవీంద్రరాజు,
రాష్ట్ర వీఆర్వోల సంఘం అధ్యక్షుడు

తెలుసుకుందాం..

ఎ-ఫాం, బీ-ఫాం అంటే..




ఎన్నికల నామినేషన్ ఘట్టం పూర్తయ్యింది. ఎన్నికల సమయంలో ఏ-ఫాం, బీ-ఫాం అనే పదాలు తరచూ వింటూంటాం. గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీలు లేదా జాతీయ రాజకీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు బీ-ఫాంలు ఇస్తాయి. పలానా నియోజకవర్గం నుంచి తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి ఇతనే అని ఇచ్చే ధృవీకరణ పత్రమే ఇది. ఈ ఫాంను పార్టీ అధ్యక్షుడు కానీ ఆ పార్టీకి చెందిన ప్రత్యేక ప్రతినిధి కానీ అభ్యర్థులకు అందిస్తారు. నామినేషన్ వేసే సమయంలో రిటర్నింగ్ అధికారికి అవసరమైన ధృవపత్రాలతో పాటు బీ-ఫాంను దాఖలు చేయాల్సి ఉంటుంది. బీ-ఫాం సమర్పించిన అభ్యర్థులకే ఎన్నికల కమిషన్ ఆ పార్టీ గుర్తును కేటాయిస్తుంది. లేకపోతే అతడిని స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తుంది. పార్టీ అధ్యక్షుడు లేదా పార్టీ నియమించిన ప్రత్యేక ప్రతినిధి అభ్యర్థులకు బీ-ఫాంలు అందిస్తారు. ఆ అధికారాన్ని ఆయనకు అప్పగిస్తూ ఇచ్చేదే ఏ-ఫాం. ఇది తీసుకున్న వ్యక్తికే అభ్యర్థులకు బీ-ఫాం ఇచ్చే అధికారం ఉంటుంది.

-గణపవరం

ఇదీ సంగతి !

నాలుగు మండలాల్లో మహిళా ఓటర్లదే హవా



ఆచంట నియోజకవర్గంలో కొత్తగా 1,349 మంది ఓటర్లు పెరిగారు. జనవరి నెలలో నియోజకవర్గంలో లక్షా 78 వేల 668 మంది ఓటర్లు ఉండగా పెరిగిన ఓటర్లతో కలిపి మొత్తం లక్షా 80 వేల 17 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 88 వేల 881 , మహిళలు 91 వేల 132 మంది , ట్రాన్స్‌జెండర్స్ నలుగురున్నారు. ఆచంట మండలంలో పురుషులు 24,176, మహిళలు 24,284 మంది , పెనుగొండలో పురుషులు 28,027, మహిళలు 28,787 మంది, పెనుమంట్రలో పురుషులు 23,801, మహిళలు 25,031 మంది, పోడూరు మండలంలో పురుషులు 12,877 మంది, మహిళలు 13,030 మంది ఉన్నారు. ఈ నాలుగు మండలాల్లో కూడా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఆచంటలో 108 మంది, పెనుగొండలో 760, పెనుమంట్రలో 1,230, పోడూరులో 153 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

- ఆచంట

ఓటు పడాలంటే పడవ దాటాల్సిందే !

లంక గ్రామాల్లో నాలుగు పోలింగ్ కేంద్రాలు



ఆచంట, ఏప్రిల్ 27: ఎన్నికలు ఎపుడు జరిగినా కొంతమంది ఎన్నికల సిబ్బంది మాత్రం గోదావరిలో పడవ ప్రయాణం చేసి ఎన్నికల విధులు నిర్వర్తించవలసిందే. ఆచంట మండలంలో పెదమల్లం, అయోధ్యలంక రెండు లంక గ్రామాలున్నాయి. పెదమల్లంలో పోలింగ్ కేంద్రం 85 . ఈ గ్రామంలో ఒకటే పోలింగ్ కేంద్రం. అయోధ్యలంకలో మూడు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అయోధ్యలంక పీఎస్ నెం.185, మర్రిమూల పీఎస్ నెం. 186, పుచ్చల్లంక పీఎస్ నెం.187 ఉన్నాయి. ఈ నాలుగు పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 3,592 ఓట్లు ఉన్నాయి. అయితే ఎన్నికల అధికారులు ఈ రెండు గ్రామాలకు గోదావరిలో పడవ దాటి లంకగ్రామాలకు వెళ్లవలసిందే. దీంతో ఎన్నికల అధికారులు వీరి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. మండలంలోని కోడేరు పల్లిపాలెం లంకకు సంబంధించి ఓటర్లు మాత్రం గోదావరిలో పడవ దాటి కోడేరులో ఉన్న పోలింగ్ బూత్‌లో ఓట్లు వేసేందుకు వస్తారు. ఇక్కడ సుమారు 200 మంది ఓటర్లు ఉంటారు. ప్రతీ ఎన్నికల్లో అధికారులు ఓటర్లను తీసుకు రావడానికి పడవలను ఏర్పాటు చేస్తారు. మండలంలో మూడు లంక గ్రామాలకు సంబంధించి రెండు లంకగ్రామాలకు అధికారులే వెళతారు. ఒక లంక గ్రామానికి సంబంధించి ఓటర్లు మాత్రం ఓటు వేయడానికి రావాల్సిందే.

జగన్ అరాచకాలపై చార్జిషీట్ దాఖలు చేస్తాం

▸▸ చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్


టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సొంగా రోషన్‌కుమార్

లింగపాలెం/చింతలపూడి, ఏప్రిల్ 27: జగన్ అరాచకాలపై చార్జిషీట్ దాఖలు చేస్తాం. సొంత బాబాయ్‌ని చంపి ఆ నెపం చంద్రబాబు నాయుడిపై వేశారు. సొంత చెల్లెళ్ళనే బయటకు తోసేశాడని, చెల్లెళ్లకు రక్షణ లేకుండా పోయిందంటే రాష్ట్రంలో ఉన్న అక్కాచెల్లెమ్మలకు జగన్ ఎలా న్యాయం చేస్తారని చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం లింగపాలెం మండలంలోని లింగపాలెం, సింగగూడెం, మల్లేశ్వరం గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, పామర్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి లేదని, వైసీపీ విధానాలు నచ్చక తాము టీడీపీలో చేరుతున్నామని వారు తెలిపారు. రాష్ట్రంలో అరాచక పాలన పోవాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు ఆరేపల్లి రామారావు, ముసునూరి రాము, కూరపాటి వెంకటేశ్వరరావు, గుత్తా సత్యసాయి వరప్రసాద్, గారపాటి బుజ్జియ్య, మోరంపూడి ప్రసాద్, బొంతు రాంబాబు, బొంతు శ్రీనివాసరావు, అసిలేటి అజయ్, తాడేపల్లి దాసు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం శనివారం చింతలపూడి మండలంల రాఘవాపురంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త పోలగాని సాయి కుటుంబాన్ని రోషన్‌కుమార్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, మాటూరి వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు అడ్డుకట్ట వేయాలి

▸▸ గోపాలపురం కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు


ద్వారకాతిరుమలలో ప్రచారం చేస్తున్న మద్దిపాటి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 27: జగన్ ఐదేళ్ల దుష్టపాలనలో నవ్యాంధ్ర విధ్వంసానికి గురైందని రాష్ట్ర పునర్నిర్మాణం జరగాలంటే ఈ అరాచకపాలనకు అడ్డుకట్ట వేయాలని గోపాలపురం నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ద్వారకాతిరుమలలో శనివారం సాయంత్రం ఇంటింట ప్రచారం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ రాక్షస పాలనను తరిమికొట్టాలంటే టీడీపీ కూటమికి ప్రజలు ఓటు వేసి పట్టం కట్టాలని కోరారు. ద్వార కాతిరుమల టీడీపీ నాయకుడు మొగతడకల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. కేఎస్ జవహర్, కూటమి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ


శ్రీవారి ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

ద్వారకా తిరుమల, ఏప్రిల్ 27: గోవింద నామాలతో చిన్నతిరుమలేశుని క్షేత్రం మార్మోగింది. శనివారం ఆలయానికి భక్తుల రాకతో కళకళలాడింది. దాదాపు 15వేల మందిపైబడి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. దర్శనానంతరం స్వామివారి ఉచిత అన్నప్రసాదం స్వీకరించారు. సాధారణ దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది.

ముగిసిన ఇంగ్లీషు స్కిల్స్‌పై జాతీయ సదస్సు

గణపవరం, ఏప్రిల్ 27: గణపవరంలోని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఇంగ్లీష్ స్పీకింగ్ స్కిల్స్‌పై రెండు రోజుల పాటు జాతీయ సదస్సు జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మలకుమారి తెలిపారు. ఈనెల 26, 27 తేదీల్లో జాతీయస్థాయిలో జూమ్ సదస్సు నిర్వహించామన్నారు. ఈ సదస్సుకు నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. సదస్సులో ఆఫీసర్ ఆఫ్ స్పెషల్ డిప్యూటీ ఉన్నత విద్యా శాఖ కమిషనర్ (ఏపీ), కామవరపుకోట డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొగంటి విజయ్‌బాబు, ప్రొఫెసర్లు డాక్టర్ రాజ్యలక్ష్మి, బాస్కరరాజు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. సదస్సులో ఇంగ్లీష్ స్పీకింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడానికి దోహదం చేసే పలు పద్ధతులపై, వివిధ డిజిటల్ టూల్స్‌పై సామాజిక మాధ్యమాల పాత్రపై ఆసక్తికరమైన చర్చ జరిగింది. ఈ సదస్సుకు పలు రాష్ట్రాల నుంచి 110 మంది అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

వైసీపీ మేనిఫెస్టో అట్టర్ ఫ్లాప్

కలిదిండి, ఏప్రిల్ 27 : వైసీపీ మేనిఫెస్టో అట్టర్ ఫ్లాప్ అని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం దుంపలకోడు దిబ్బలో నియోజకవర్గ అగ్నికుల క్షత్రియుల సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో అగ్నికుల క్షత్రియులతోపాటు వెనుకబడిన కులాల వారికి తగిన ప్రాధాన్యత లేదన్నారు. నా బీసీలు అని చెప్పుకునే సీఎం జగన్ అగ్నికుల క్షత్రియులు, మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు.

ఆధ్యాత్మికం

నేటినుంచి పేరంటాలమ్మ ఉత్సవాలు ప్రారంభం


నాగస్విని పేరంటాలమ్మ ఆలయం

దెందులూరు,ఏప్రిల్ 27 : మండలంలోని గాలాయగూడెం పూజారి వారి ఆడపడుచు గ్రామ దేవత శ్రీనాగస్విని పేరంటాలమ్మ ఉత్సవాలను ఆదివారం నుంచి బుధవారం వరకు నిర్వహిస్తామని ఉత్సవ నిర్వాకులు తెలిపారు, ఆదివారం తెల్లవారు జాము నుంచి అమ్మవారు పూజారి ఆడపడుచు కావడంతో పసుపు, కుంకుమ, పుట్టింటి నూతన వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. బుధవారం అన్నదానంతో పాటు అగ్నిగుండం కార్యక్రమం నిర్వహిస్తామని గాలాయగూడెం ఉత్సవ కమిటీ తెలిపింది.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


రాట్నాలమ్మకు భక్తుల పూజలు

పెదవేగి, ఏప్రిల్ 27 : రాట్నాలకుంట రాట్నాలమ్మవారి తిరునాళ్ళ మహోత్సవాలు చివరిరోజు శనివారం ఉదయం ఆరు గంటలకు విఘ్నేశ్వరపూజ, నవగ్రహ మండపారాధన, పరివార దేవతార్చన, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉదయం పది గంటలకు శాంతి కల్యాణం, అనంతరం జరిగిన భారీ అన్నసమారాధనలో విశేషసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. రాత్రి రాత్రి ఎనిమిది గంటలకు కోలాటం, అనంతరం పూలరంగడు సాంఘిక పద్యనాటకం నిర్వహించారు.

రాజరాజేశ్వరిదేవి అలంకరణలో రాట్నాలమ్మ..

రాట్నాలకుంట రాట్నాలమ్మ తిరునాళ్ళు చివరిరోజు శనివారం అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శంకుచక్రాలతోపాటు ఆకలి తీర్చే అన్నపూర్ణగా అన్నపాత్రతో దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

సమస్యలు మీవి.. పరిష్కారం నాది..

▸▸ ఎవరికీ ఏలోటూ లేకుండా చేస్తా..

▸▸ ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్

ఏలూరు ఏప్రిల్ 27, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో గడిచిన ఐదేళ్లుగా ఎక్కడి సమస్యలక్కడే, రైతులకు గిట్టుబాటు ధరలు లేవు. యువతకు ఉపాధి అవకాశాలు లేవు, పరిశ్రమలు పెట్టలేదు, ఎత్తిపోతలు పూర్తి చేయలేదు. ధరల స్థిరీకరణ చేయలేదు.. ఏమి చేశారిన్నాళ్లు. ఈ సమస్యల పరిష్కారమే నాతొలి లక్ష్యం. అందరి మద్దతుతో నన్ను ఎన్నుకుంటే ఈ సమస్యల ప్రస్తావన, పరిష్కారమే లక్ష్యమంటూ ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ తమ ప్రచారంలో అన్నిచోట్లా ప్రస్తావిస్తున్నారు. తనకు ఏలూరు లోక్‌సభ స్థానంపై పూర్తి అవగాహన ఉందని, అంతకంటే మించి పాలనాపరంగా మూలనపడిన సమస్యలు, కారణమైన వైసీపీ నిర్లక్ష్యం, ప్రజలతో పాటు తనకూ తెలిసిందేనని, వీటి పరిష్కారమే తన లక్ష్యంగా ప్రజల ఎదుట భరోసా ఇస్తుండడం తెలుగుదేశంలో ఉత్సాహాన్నిస్తోంది. పుట్టా మహేష్‌కుమార్ స్థానికుడు కాదని పదేపదే వైసీపీ చేస్తున్న విమర్శలను పూర్తిగా తిప్పికొడుతున్నారు. గడిచిన వారం రోజులుగా ఇన్నాళ్లు అధికారం చెల్లాయించిన వైసీపీ ఏమీ చేసిందని, స్థానికంగానే వున్న నేతలంతా ఎందుకు కళ్లు మూసుకున్నారంటూ ఎదురు ప్రశ్నలు వేయడం అటు వైసీపీలోనూ సమాధానం చెప్పలేని పరిస్థితి. ఇదే విషయాన్ని వివిధ నియోజకవర్గాల్లో పోటీలో వున్న అసెంబ్లీ అభ్యర్థులంతా మహేష్ యాదవ్‌కు మద్దతు ఇవ్వడం ఆరంభమైంది. లక్షలాది ఎకరాలకు నీరందించే చింతలపూడిని ఎందుకు పూర్తి చేయలేకపోయారు. మెట్ట ప్రాంతానికి సాగునీరు ఇవ్వడం మీకు ఇష్టం లేదా, లేక రైతులను అప్పులు పాల్జేసేయడం మీ లక్ష్యమా అంటూ వైసీపీని ప్రశ్నిస్తూనే తాను ఎంపీగా ఎన్నికైన మరుక్షణం ఈ ఎత్తిపోతల పనులను భుజాన వేసుకుని పూర్తయ్యే వరకు విశ్రమించబోనని మెట్ట రైతులకు ధైర్యం చెప్పే పనిలో పడ్డారు. గడిచిన ఐదేళ్లుగా చింతలపూడి పనులేవి అంగుళం ముందుకు సాగకపోవడం, పరిహారం విషయం పక్కపెట్టడం వంటి వైసీపీ నిర్లక్ష్య విధానాలను ఎండగడుతుండటంతో సహజంగానే రైతు ల్లో మహేష్‌కుమార్ యాదవ్‌కు మద్దతు పెరిగేలా చేసిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కేవలం వ్యక్తిగత విషయాలనే టార్గెట్‌గా చేసుకుని ప్రజా సమూహా సమస్యలను గాలికొదిలేశారన్న ఆయన వాదనతో రైతులు, విద్యా వంతులు కూడా ఏకీభవించడం కొత్త పరిణామంగా భావిస్తున్నారు. లోక్‌సభ అభ్యర్థిగా పార్టీ ప్రకటించిన నాటినుంచి నేటి వరకు రాజకీయపరమైన అంశాల్లో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి శ్రేణులు ఏకతాటిపైకి వచ్చే విషయంలోనూ మహేష్‌కుమార్ యాదవ్ చొరవ తీసుకోవడాన్ని పార్టీ పరిగణనలోకి తీసుకుంది. లోక్‌సభస్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో తనకు గుర్తింపు లభించేలా ప్రచారం నిర్వహించడం ప్రజలను ఆకట్టుకుందని అటు జనసేన, ఇటు బీజేపీతో సహా టీడీపీ కూడా ఏకీభవిస్తున్నట్లుగా సమాచారం. పోలవరం నిర్వాసితుల సమస్యలను ఆయన ప్రస్తావించడం, పరిహారం, పునరావాసంలో తానే అందరికీ అండగా ఉంటానని భరోసా ఇవ్వడంతో ముంపు మండలాల్లోనూ తమ పార్టీకి కూటమికి బలం చేకూరుతుందని కూటమి సీనియర్ నాయకులు ధీమాగా వున్నారు.

పేదలను దోచుకునే వైసీపీని సాగనంపాలి

▸▸ ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల


జల్లికాకినాడలో ప్రచారం చేస్తున్న పత్సమట్ల

గణపవరం/ఉంగుటూరు, ఏప్రిల్ 27: పేదలను దోచుకుని తినే వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని ఉంగూటరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం గణపవరం మండలం జల్లికాకినాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో విధ్వంస పాలన కొనసాగించిన సీఎం జగన్‌ను ఎన్నికల్లో తరిమికొట్టాలన్నారు. 30 మందికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు దండు శ్రీహరిరాజు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, టీడీపీ నాయకుడు దండు శ్రీనివాసరాజు, బంటుమిల్లి జార్జ్, మల్లంపల్లి సీతాలయ్య, వేగేశ్న సూర్యనారాయణరాజు, జనసేన నాయకుడు కర్తాక పల్లయ్య బీజేపీ నాయకుడు ఇందుకూరి అశోకచక్రవర్తి వర్మ, తదితరులు పాల్గొన్నారు. ఉంగుటూరులోని పార్టీ కార్యాలయంలో దక్షిణ భారత తెలగ కాపు, బలిజ సంఘం జాయింట్ కన్వీనర్ దాసరి రాము మాట్లాడుతూ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా శనివారం ధర్మరాజును కలిసి మద్దతు తెలిపారు. ఉంగుటూరు మండలం నారాయణపురం, కైకరం గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు ధాన్యం పట్టుబడి కూలీలను, ఉపాధి హామీ కూలీలను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. శనివారం సాయంత్రం గోపాలపురం, పందిరెడ్డిగూడెం గ్రామాల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలసి ధర్మరాజు ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు.

నియంత జగన్ పాలనలో రాష్ట్రం విధ్వంసం

▸▸ ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి


విలేకరులతో మాట్లాడుతున్న బడేటి చంటి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 27: రాష్ట్రంలో ఆరాచక పాలనను అంతమొం దించటానికే కూటమి ఏర్పడిందని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనపై ఎన్‌డీఏ కూటమి చార్జిషీటు దాఖలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అరాచక పాలనపై చర్యలుంటాయన్నారు. నియంత జగన్ పెత్తందారి పాలనలో రాష్ట్రం విధ్వంసమైందన్నారు. రోజురోజుకు అక్రమ అరెస్టులు, అక్రమకేసులు ఎక్కువయ్యాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లపై దాడులు అధికమయ్యాయన్నారు. రాష్ట్రంలో ఐపీసీ కోడ్‌ను వైసీపీ కోడ్‌గా మార్చారన్నారు. మహిళల మిస్సింగ్ కేసులు రాష్ట్రంలోనే ఎక్కువని కేంద్ర నిఘా సంఘాలు తేల్చాయన్నారు. మూడు రాజధానుల పేరుతో జగన్ ప్రజలను మోసం చేశాడని. జగన్ ప్రకటించిన మేనిఫెస్టోలో ఏమిలేదన్నారు.

● ఏలూరు 45వ డివిజన్‌లో ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరిగి జగన్ ఆరాచకాలను వివరించటంతో పాటు చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుత ఎమ్మెల్యే నాని చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. జనసేన ఇన్‌ఛార్జ్ రెడ్డి అప్పలనాయుడు, ఎంఆర్‌డీ బలరామ్, కొట్టు మనోజ్, శివప్రసాద్, నాగిరెడ్డి, కాశీనరేష్, మల్లెపురాము, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ప్రభాకర్, ఆంథోనీనగర్‌లో రోషన్‌కుమార్ సతీమణి విజయ.. బుట్టాయగూడెంలో జగనాసుర, చార్జిషీట్‌ను విడుదల చేస్తున్న టీడీపీ నాయకులు

వైసీపీవీ నీచ రాజకీయాలు

▸▸ దెందులూరు కూటమి అభ్యర్థి చింతమనేని

పెదవేగి/పెదపాడు ఏప్రిల్ 27 : వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోందని దెందులూ రు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ విమర్శించారు. లక్ష్మీపురంలో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో దళితులపై దాడిచేశానని అసత్య ప్రచారాలు చేస్తున్న ఘటనపై జనసేన, బీజేపీతో కలిసి దుగ్గిరాలలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొంతమంది కావాలని ప్రచారం మధ్యలోకి వచ్చి గొడవ పెట్టుకున్నారన్నారు. ఇది సరైన విధానం కాదన్నారు. తనతోపాటు ప్రచారంలో పాల్గొన్నాడని లక్ష్మీపురం పంచాయతీ వీరంపాలెంకు చెందిన బెజవాడ తేజ అనే కార్యకర్తపై విచక్షణారహితంగా దాడిచేశారని, తీవ్రంగా గాయపడ్డ తేజ ఏలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. వైసీపీ నేతలు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. పెదపాడు మండలంలోని కొత్తూరు, ముప్పర్రు, వీరమ్మకుంట, వెంకటాపురం, రామచంద్రపురం, పెదపాడు గ్రామాల్లో చింతమనేని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పెదవేగి మండలం దుగ్గిరాలలో పెదవేగి మండలం వినకడిమికి చెందిన వైసీపీ నాయకులు కడమంచి గోపరాజు, పస్తం దుర్గారావు, పాలపాటి తిరుమలతోపాటు వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి.

● చింతలపూడి, ఏప్రిల్ 27:చింతలపూడి ఆంథోనీనగర్‌లో మంచినీరు డ్రెయినేజీ సమస్యలు పరిష్కారం చేస్తామని కూటమి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ భార్య విజయ్‌కుమారి స్థానికులకు భరోసా ఇచ్చారు. శనివారం చింతలపూడి నగరపంచాయతీలోని ఆంథోనీనగర్‌లో జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం జరిపారు.

● బుట్టాయగూడెం/జీలుగుమిల్లి, ఏప్రిల్ 27 : రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్న జగన్‌రెడ్డిని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కొండారెడ్డి నరహరి వరప్రసాద్, టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు అన్నారు. శనివారం బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో జగన్ ఆరాచక పాలనకు సంబంధించిన జగనాసుర రక్తచరిత్ర, ఎన్డీఏ చార్జిషీట్‌ను విడుదల చేశారు. జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం, పూచికపాడు, రాచన్నగూడెం గ్రామాల్లో టీడీపీ నాయకులతో కలసి ఆయన ప్రచారం నిర్వహించారు.

చెక్‌పోస్టు తనిఖీలో వ్యయపరిశీలకుడు భూటియా


సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు భూటియా

భీమడోలు, ఏప్రిల్ 27 : ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు షేరింగ్ జోర్డన్ భూటియా శనివారం భీమడోలు స్టాటిస్టిక్ సర్వేలైన్స్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాల తనిఖీల తీరును పరిశీలించారు. చెక్‌పోస్టులో ఇప్పటివరకు తనిఖీ చేసిన రిజిస్టర్లను పరిశీలించిన ఆయన సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అన్ని వాహనాలను తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50వేలకు మించి నగదు ఉంటే వాటిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ సహాయ వ్యయ అధికారి ఎస్. శివనాగరాజు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టులో ఎస్ఈబీ డీసీ తనిఖీ

జీలుగుమిల్లి, ఏప్రిల్ 27 :తాటియాకులగూడెం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమీషనర్ ఎం.శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలంగాణ నుంచి ఆంధ్రాకు రాకపోకలు సాగించే వాహనాల తనిఖీలపై ఆ శాఖ అధికారులతో చర్చించారు. చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలించారు. రాత్రి సమయాల్లో అనుమానం కలిగే వాహనాల్ని క్షణ్ణంగా పరిశీలించాలన్నారు. జంగారెడ్డిగూడెం సీఐ పట్టాభిచౌదరి, ఎస్ఐలు ఎలియాజర్, శేఖర్‌బాబు, హెచ్‌సీ సీతారాం ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

వేర్వేరు చోట్ల తనిఖీల్లో నగదు స్వాధీనం

ఉంగుటూరు, ఏప్రిల్ 27 : ఉంగుటూరులో అధికారులు జరిపిన తనఖీలలో వేర్వేరుగా రూ.70వేలు, రూ.57,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు శనివారం అధికారులు తెలిపారు. సరైన ధ్రువపత్రాలు చూపని కారణంగా ఎన్నికల నిబంధనల మేరకు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వాసవీ అన్నదాన ట్రస్టుకు రూ.3 లక్షలు విరాళం


దాత నుంచి చెక్‌ను అందుకుంటున్న బొండాడ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 27: ద్వారకాతిరుమలలోని క్షేత్ర వాసవీమాత అన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన దాత కలువ విజయలక్ష్మి ట్రస్టు చైర్మన్ బొండాడ రామ్మోహనరావు చేతుల మీదుగా అన్నదానానికి శనివారం రూ.3 లక్షలను విరాళంగా అందజేశారు. ఇమ్మడి నాగు, ఇమ్మడి రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

కూటమికి మాదిగ కుల సంఘాల మద్దతు


విలేకరులతో మాట్లాడుతున్న మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి నాయకులు

ఏలూరు క్రైం : సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కూటమికి రాష్ట్రంలో ఉన్న మాదిగ కుల సం ఘాల మద్దతు ఉంటుందని ఆ సంఘాల నాయకులు శనివారం ఏలూరులో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో పర్యటిస్తున్న ఆ కుల సంఘాల నాయకులు ఏలూరులో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు ఆర్‌జే ప్రకాష్ మాదిగ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలులోకి తీసుకువస్తారని అన్నారు. అనంతరం జై మాదిగ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొదమాల బెంజిమన్ మాదిగ మాట్లాడుతూ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకుంటామని అన్నారు. సమావేశంలో ఏలూరు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు తవిటి పవన్‌కల్యాణ్ మాదిగ, జై మాదిగ సేవా సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.సునీల్, నాయకులు నరసింహమూర్తి, బలరామ్ మహేష్, వీరన్న పలువురు పాల్గొన్నారు.

నేటి నుంచి భగవద్గీతపై ఉచిత శిక్షణ

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 27:వైఎంహెచ్ఏ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి వైఎంహెచ్ఏ ప్రాంగణంలో ఆధ్యాత్మిక ప్రవచనకర్త హరిశ్రీనివాస్‌శాస్త్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీతపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు వైఎంహెచ్ఏ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు వై.సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వేసవిసెలవుల్లో శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపాడు, ఏప్రిల్ 27 : పెదపాడు సబ్‌స్టేషన్ పరిధిలో వున్న 11కేవీ రాళ్లపల్లివారిపాలెం ఫీడర్ న్యూలైన్ల నిర్మాణం, లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈనెల 29, 30, మే 1వ తేదీల్లో ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కరెంట్ సరఫరా నిలుపుదల చేస్తామని పెదపాడు ఎలక్ట్రికల్ ఏఈ వై.రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సేవాకార్యక్రమాల్లో మానవత ముందంజ


డైపర్లు అందిస్తున్న సంస్థ సభ్యులు

పోలవరం, ఏప్రిల్ 27 : సేవా కార్యక్రమాల్లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ముందుంటుందని సంస్థ రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య అన్నారు. శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 80 వేల మంది సభ్యులతో గత ఇరవై ఏళ్లుగా మానవత సేవలందిస్తుందన్నారు. శనివారం భవిత స్కూలులో మానసిక వికలాంగులకు డైపర్లు అందించినట్టు తెలిపారు. మానవత మండల అధ్యక్షుడు గోళ్ళ గణేష్, కన్వీనర్ ఆకుల నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడు పూనెం పోసిబాబు, కార్యదర్శి కె.రాంబాబు, కోశాధికారి నారాయణ, చైర్మన్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 27 : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తూర్పువీధికి చెందిన అద్దేపల్లి సుమన్(45) ఇద్దరు భార్యలు ఉన్నారు. ఒక భార్యకు కుమారుడు ఉండగా, మరో భార్యకు కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఈ ఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

15 లీటర్ల సారా స్వాధీనం.. కేసు నమోదు

లింగపాలెం,ఏప్రిల్ 27: లింగపాలెంలో సారా తయారు చేస్తున్న స్థావరంపై దాడి చేశామని ఎస్ఐ పి.చెన్నారావు శనివారం తెలిపారు. ముందస్తు సమాచారంతో సిబ్బందితో దాడి చేసి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

లింగపాలెం, ఏప్రిల్ 27: ధర్మాజీగూడెం శివారులో ఎదురెదురుగా ట్రాక్టర్, బైక్ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. దాసరి అనిల్‌కుమార్ అనేవ్యక్తి బోగోలు నుంచి ఏలూరువైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఢీ కొట్టడంతో ఆ వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని ధర్మాజీగూడెంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా వాహనం తోలుతూ ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు.

తాళాలు పగులగొట్టి చోరీ

▸▸ మూడు బంగారు ఉంగారాలు.. బైక్ అపహరణ

ముసునూరు, ఏప్రిల్ 27: వేల్పుచర్లలో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేసిన ఘటన గురువారం రాత్రి జరిగింది. పొలగాని రవి కుటుంబ సమేతంగా గురువారం గ్రామాంతరం వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరిగి వచ్చేసరికి, ఇంటి తాళాలు పగులగొట్టి తలుపులు తెరిచి ఉండటంతో బాధితుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ పి.వాసు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఈ చోరీలో 16 గ్రాముల మూడు బంగారు ఉంగరాలు, రూ. 20 వేలు విలువగల మోటారుసైకిల్ చోరీ అయినట్టు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'త్రీటౌన్' ఇన్‌చార్జి సీఐగా శ్రీనివాసరావు



ఏలూరు క్రైం, ఏప్రిల్ 27 : ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐగా ఏలూరు ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు శనివారం సాయంత్రం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌పై రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించగా స్టేషన్ సీఐ వెంకటేశ్వరరావును, అసిస్టెంట్ రైటర్ రాజేం ద్ర, కానిస్టేబుల్ ఇస్మాకును అరెస్టు చేశారు. వారిని శనివారం విజయవాడ ఏసీబీ కోర్టుకు హాజరుపరిచారు. ఈ మేరకు ఏలూరు త్రీటౌన్ సీఐ పోస్టు ఖాళీ కావడంతో ట్రాఫిక్ సీఐ ఎ. శ్రీనివాసరావును ఇన్‌ఛార్జిగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఆయన శనివారం బాధ్యతలను చేపట్టారు. ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా శాంతి భద్రతలు కాపాడే నిమిత్తం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన నేపథ్యంలో ట్రాఫిక్ సీఐను ఇన్‌ఛార్జి సీఐగా నియమించినట్లు తెలుస్తోంది.

పేదలు, వృద్ధులకు ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 27: సమాజసేవను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఏలూరు పట్టణ కొప్పుల వెలమ కులసంఘం నగర అధ్యక్షుడు భీమవరపు పాపారావు, కార్యదర్శి మరడాని అచ్యుతరావు పేర్కొన్నారు. సంఘంలోని పేదలు, వృద్ధులు, నిరుపేదలకు దాతల సహకారంతో ప్రతినెల రూ.500 పింఛన్ రూపంలో అందజేస్తున్నారు. శనివారం సంఘ కార్యాలయంలో 20మంది పేదలు, వృద్ధులు తదితరులకు రూ.500చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం 20 మందికి ప్రతినెల రూ.500 చొప్పున అందజేస్తున్నామని దాతలు సహకరిస్తే మరికొంతమందికి సహాయం అందజేస్తామన్నారు. కార్పొరేటర్ భీమవరపు హేమసుందరి, ట్రెజరర్ మూడెడ్ల రంగారావు, ఉపాధ్యక్షులు పడాల వెంకటేశ్వరరావు, సలహాదారు లచ్చిరెడ్డిగోవింద, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

ఏలూరు రూరల్, ఏప్రిల్ 27: స్థానిక నవయుగ మున్సిపల్ స్కూల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ చిన్నారులకు శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ పీడీ ఎ.పద్మావతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రీస్కూల్లో చదువు ప్రాధాన్యతను వివరించారు. కాన్వెంట్‌లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. బోధనా పరికరాలు అందుబాటులో ఉన్నాయని ఐదేళ్ళ పూర్తయిన 13 మంది పిల్లలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఏలూరు సెక్టార్-2 సూపర్‌వైజర్ ఎం.దేవిమౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.నవతి, కె.ఝాన్సీలక్ష్మి, నాగదేవి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పైకి వెళ్ళిన లారీ.. తప్పిన ముప్పు

ఆగిరిపల్లి, ఏప్రిల్ 27: ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గొల్లగూడెం గ్రామాల మధ్య రహదారిపై లారీకి బ్రేక్ ఫెయిలై బీభత్సం సృష్టించింది. రహదారి పక్కన పార్క్ చేసి ఉన్న రెండు బైకులు, ఒక ఆటో, కరెంటు పోల్‌ని ఢీకొని సమీపాన మట్టిలో ఆగిపోయింది. లారీ నూజివీడు నుంచి విజయవాడ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈదర గ్రామానికి చెందిన డ్రైవర్ గురుముప్పు చిన్న పండు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంపై పోలీసులు వివరాలు సేకరించారు.

విద్యార్థిని అదృశ్యం .. కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 27 : దెందులూరు మండలానికి చెందిన ఒక విద్యార్థిని ఏలూరులోని ఓ డిగ్రీ కాలేజీలో సెకండ్ ఇయర్ చదువుతుంది. ఈనెల 26వ తేదీన యథావిధిగా బస్సులో కాలేజీకి వచ్చి తిరిగి వెళ్ళలేదు. ఆమె తండ్రి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయడంతో ఇన్‌చార్జి సీఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిధులు రాక.. హామీలు నెరవేర్చలేక..

గ్రామాల్లో అభివృద్ధి జాడలేదు. కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం స్వాహా చేసింది. పారిశుధ్య కార్మికులకు జీతాల్లేవు. తాగునీటిని అందించలేని దుస్థితి. చివరికి వీధిదీపాలు వేయాలన్నా నిధులు లేవు. గ్రామ స్వరాజ్యం అంటూ ప్రథమ పౌరులుగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామస్థులకు అభివృద్ధిపై వివరణ ఇవ్వలేని దుస్థితి. దీంతో అలంకార ప్రాయంగా మారిన ఈ పదవులు తమకు ఎందుకంటూ రాజీనామాకు దిగుతున్నారు. ఇటీవల నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం సూరేపల్లిలో సర్పంచ్ రాజీనామాయే దీనికి ఉదాహరణ.

(ముసునూరు)

▸▸ గ్రామాలు అభివృద్ధి చేయలేక సర్పంచ్‌లు సతమతం ▸▸ ఇటీవల సూరేపల్లి గ్రామ సర్పంచ్ రాజీనామా

గ్రామాభివృద్ధి చేసి చూపాలని అందుకు ప్రథమ పౌరురాలిగా కృషి చేసి గ్రామ చరిత్రలో తన పేరు నిలవాలనే ఆశతో 2021లో పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీచేసి ఎన్నికయ్యారు ముసునూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన వెల్ది ఉమామహేశ్వరి. ఎన్నికైన నాటి నుంచి రాష్ట్రప్రభుత్వం ద్వారా ఒక్క రూపాయి నిధులు పంచాయతీ ఖాతాకు జమకాలేదు. అయినా గ్రామాల్లో కనీస మౌలిక వసతులైన మురుగునీటి పారుదల, వీధి దీపాలు, తాగునీటి సరఫరా చేయాలి. దీంతో సొంత నిధులతో సర్పంచ్ సమకూర్చారు. అయినా నిధుల జాడ లేదు. చివరికి 2014, 15 ఆర్థిక సంఘం నిధులను సైతం రాష్ట్రప్రభుత్వం తన స్వాహా చేయడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. గ్రామాభివృద్ధికి ఉపయోగపడతాయనుకున్న రూ.60 లక్షల నిధులు రాకపోవడంతో గ్రామానికి పక్కా డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటుచేసి మౌలిక వసతుల కల్పించి అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామన్న హామీని నెరవేర్చలేని పరిస్థితిలో సర్పంచ్ ఉమామహేశ్వరి ఆలోచనలో పడాల్సి వచ్చింది. సర్పంచ్‌ల సంఘంతో కలిసి రాష్ట్రప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తే కనీసం నిధులు మంజూరు కాకపోతాయా? అంటూ ఒక దశలో ప్రయత్నం చేసినా అది విఫలమైంది. మరోవైపు గ్రామంలో మౌలికవసతులు కల్పించలేకపోతున్నారనే విమర్శతో మనస్థాపం చెంది చివరికి ఆమె తన సర్పంచ్ పదవికి నాలుగు నెలల క్రితం రాజీనామా చేశారు. ఎన్నో ఆశలతో పదవిలోకి వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి మోకాలడ్డడంతో నిరాశతో ఆమె పదవి నుంచి వైదొలిగారు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన ఐదు కిలోమీటర్ల పొడవు అయినటువంటి ఆరు రహదారులను ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం రివర్స్ టెండరింగ్‌తో అభివృద్ధి రివర్స్‌చేయటం, పంచాయతీ, పారిశుధ్య కార్మికులకు నెలలతరబడి జీతాలు పెండింగ్‌లో ఉంచటం, పాడైపోయిన బోరు మరమ్మతు చేయించలేకపోవడం వంటివి తన వైఫల్యాలుగా మారాయని, వార్డుసభ్యులు చందాలు వేసుకుని బోర్లను బాగుచేయించుకునే పరిస్థితుల్లో ఈ ప్రభుత్వంలో తాము సర్పంచ్‌లుగా ఉండటం బాధాకరంగా ఉందంటూ సూరేపల్లి ఇన్‌చార్జి సర్పంచ్ ముళ్ళపూడి సుధారాణి ఆంధ్రజ్యోతి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. నూజివీడు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని చెప్తున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు గత ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాలకు చేసింది శూన్యమని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి చేయలేకే రాజీనామా

సూరేపల్లి పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దామని సర్పంచ్‌గా పోటీచేసి గెలిపొందా. అయితే వైసీపీ ప్రభుత్వం పంచాయతీ అభివృద్ధికి ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను సైతం కైంకర్యం చేయడంతో ఏమీ చేయలేని పరిస్థితి. పంచాయతీలో మంచినీరు, ఇతర మౌలిక సదుపాయాలకు సొంత నిధులు ఖర్చుచేసినా, బిల్లులు రాలేదు. ఈ ప్రభుత్వ పాలనలో పంచాయతీని అభివృద్ధి చేయలేమనే రాజీనామా చేశా.

-వెల్ది ఉమామహేశ్వరి, సూరేపల్లి మాజీ సర్పంచ్



మాట్లాడుతున్న బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్

వైసీపీ మేనిఫెస్టో అట్టర్ ఫ్లాప్

కలిదిండి, ఏప్రిల్ 27 : వైసీపీ మేనిఫెస్టో అట్టర్ ఫ్లాప్ అని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం దుంపలకోడు దిబ్బలో నియోజకవర్గ అగ్నికుల క్షత్రియుల సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో అగ్నికుల క్షత్రియులతోపాటు వెనుకబడిన కులాల వారికి తగిన ప్రాధాన్యత లేదన్నారు. నా బీసీలు అని చెప్పుకునే సీఎం జగన్ అగ్నికుల క్షత్రియులు, మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో చంద్రబాబు బీసీలకు పెద్ద పీట వేశారన్నారు. బీసీలకు రక్షణచట్టం, ఆదరణ పథకంతోపాటు 50 ఏళ్లకే పెన్షన్, సబ్సిడీ రుణాలు, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితర పథకాలను మేనిఫెస్టోలో పొందుపరిచి బీసీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. బీసీలంతా కూటమిని గెలిపించాలన్నారు. అగ్నికుల క్షత్రియుల సంక్షేమ సంఘం నాయకులు సంగాని గంగాధర్, నాగిడి వీరబ్రహ్మం, అంద్రాజు కృష్ణమూర్తి, దుర్గారావు, వడుగు గణపతి, కొల్లాటి నాగరాజు, మార్రాజు, వడుగు గోపాలరావు, మోకా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఇంగిలిపాకలంకలో ప్రజలతో మాట్లాడుతున్న కామినేని శ్రీనివాస్



టీడీపీలో చేరిన కొప్పుల ఏడుకొండలు, ఆలపాడు గ్రామస్థులు

అభివృద్ధి, ప్రజా మన్ననలే లక్ష్యం : కామినేని

కైకలూరు/మండవల్లి, ఏప్రిల్ 27: అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ ప్రజా మన్ననలు పొందడమే తన జీవిత లక్ష్యమని కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కైకలూరు మండలం దొడ్డిపట్ల, రామవరం, మండవల్లి మండలం నుచ్చుమిల్లి, ఇంగిలిపాకలంక గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థిగా కమలం గుర్తుకు, ఎంపీ అభ్యర్థిగా పుట్టా మహేష్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించినందుకే కైకలూరు నియోజకవర్గాన్ని ఎనలేని అభివృద్ధి చేశానని మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. తన పరిపాలనలో రౌడీలకు అవినీతి, అక్రమాలకు చోటు లేదని ప్రజలు స్వేచ్ఛగా జీవించడమే తన లక్ష్యమన్నారు. ప్రస్తుత పాలకులు అన్నివర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, రౌడీలను ప్రోత్సహించి అమాయక ప్రజలపై దాడులు చేయించి అక్రమంగా కేసులు బనాయించారన్నారు. తన అనుభవంతో కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కాంటూరు కుదింపునకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ప్రతి పేద వాడికి ఉపాధి కల్పనే తన లక్ష్యమన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైసీపీకి దెబ్బపై దెబ్బ.. ఆలపాడు సర్పంచ్ టీడీపీలో చేరిక

ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుంచి ప్రతిరోజూ వైసీపీకి ఎదురుదెబ్బ తగులుతూనే వచ్చింది. ఐదేళ్ల వారి పాలనతో విసుగు చెందిన నాయకులు, ప్రజలు, కార్యకర్తలు ఎన్డీయే కూటమి తీర్థం తీసుకుంటూ వచ్చారు. అలాగే శనివారం కైకలూరు మండలం ఆలపాడు వైసీపీ సర్పంచ్ కొప్పుల కృష్ణకుమారి, ఏడుకొండలు దంపతుల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పేటేటి భూషణరావు, తాళ్లబట్టు శ్రీనివాసరావు, కొప్పుల సూర్యనారాయణ మరో 20 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరిని అసెంబ్లీ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ముదినేపల్లి మండలం వాడవల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు 100 మంది కామినేని శ్రీనివాస్ సమక్షంలో కూటమిలో చేరారు. వారిలో కూనపురెడ్డి ఏసు, కటారి హరి, ఎర్రంశెట్టి శ్రీనివాస్, ఎర్రంశెట్టి సత్యనారాయణ, మంగినేని గంగాధర్‌తో పాటు 100 మంది కార్యకర్తలు కూటమిలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ వైసీపీకి ఓటు వేసి తప్పు చేశామని అందువల్ల ఎంతో నష్టపోయామని అలాంటి తప్పు పునరావృతం కాకుండా ఉండేందుకు, పిల్లల భవిష్యత్ కోసం కూటమిలో చేరుతున్నట్లు పేర్కొన్నారు.

కామినేని కుటుంబీకుల ప్రచారం

ముదినేపల్లి, ఏప్రిల్ 27 : కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం ముదినేపల్లి మండలం అన్నవరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కామినేని సోదరి రుద్రమదేవి, కుటుంబసభ్యులు శైలజ, కుమారి ఇంటింటా ప్రచారం నిర్వహించి ఏలూరు ఎంపీ అభ్యర్థి మహేష్ యాదవ్, కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు కోడూరు శేషుబాబు, కొత్తూరు వెంకట సుబ్బారావు, అట్లూరి లోకేశ్, బీజేపీ నాయకులు సత్యవోలు నాగలక్ష్మి, రెడ్డి రాధిక, జొన్నలగడ్డ రవికుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మేడే నిర్వహణకు అనుమతి ఇవ్వండి



నూజివీడు టౌన్, ఏప్రిల్ 27: మేడే ఉత్సవాల నిర్వహణకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ, ఏఐటీ యూసీల సంయుక్త ఆధ్వర్యంలో నూజి వీడు ఆర్డీవో వై.భవానీ శంకరికి కార్మిక సంఘ నాయకులు వినతిపత్రాన్ని అం దించారు. ప్రతి ఏటా మే 1వ తేదీ ఘనం గా కార్మిక దినోత్సవం జరపడం ఆనవాయితీ అని, ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక అనుమతులు ఇవ్వాలని ఆర్డీవోకు కార్మిక సంఘ నాయకులు చాట్ల పుల్లారావు, జి.రాజు వినతిపత్రాన్ని అందించారు.

లోకేశ్‌తో వినోద్ భేటీ



ముదినేపల్లి, ఏప్రిల్ 27: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కైకలూరు నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కొడాలి వినోద్ కలిశారు. ఉండవల్లిలోని ఆయన నివాస గృహంలో శుక్రవారం రాత్రి కలసి కైకలూరు నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై లోకేశ్‌తో చర్చించారు. నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ విజయమే లక్ష్యంగా టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సమష్టిగా కృషి చేస్తున్నామని లోకేశ్‌కు వివరించినట్టు వినోద్ తెలిపారు. విజయానికి ప్రచారంతోపాటు పోల్ మేనేజ్‌మెంట్ ప్రధాన అంశమని లోకేశ్ చెప్పారన్నారు.

నేడు కలిదిండి మండలంలో కామినేని ప్రచారం

కలిదిండి, ఏప్రిల్ 27 : కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదివారం కలిదిండి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి తెలిపారు. గుర్వాయిపాలెం, మద్వానిగూడెం, అమరావతి, కొత్తూరు, సంతోషపురం, భాస్కరరావుపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.



ముదినేపల్లి మండలంలో వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ముదినేపల్లి, ఏప్రిల్ 27 : ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున అధికారులు వాహనాల తనిఖీలను మరింత ముమ్మరం చేశారు. డబ్బు, మద్యం, ఇతర వస్తువుల రవాణాను అడ్డుకునేందుకు వాహనాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ముదినేపల్లి మండలంలో జాతీయ రహదారితోపాటు ఇతర ప్రధాన రహదారులలో వాహనాలను శనివారం పెద్ద సంఖ్యలో ఎస్ఎస్‌టీ టీం అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సుమారు 200 వాహనాలను తనిఖీ చేశారు. ఏలూరు, కృష్ణా జిల్లాల సరిహద్దులో పెదపాలపర్రు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్ పోస్టు వద్ద సుమారు 180 వాహనాలను చెక్ పోస్టు అధికారి రమణబాబు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేశారు. గుడివాడ, ఆపై ప్రాంతాల నుంచి భీమవరం, నరసాపురం, బంటుమిల్లి తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో వాహనాలు వెళ్తున్నందున ఈ చెక్ పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత 40 రోజులుగా సుమారు 7 వేల వాహనాలను తనిఖీ చేసినట్టు అధికారులు తెలిపారు.



నాగభూషణం చిత్రపటం వద్ద సీపీఐ, సీపీఎం నాయకుల నివాళి

దాసరి నాగభూషణరావుకు ఘన నివాళి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 27: భూ పోరాట యోధుడు దాసరి నాగభూషణరావు 16వ వర్ధంతి సందర్భంగా నూజివీడు అమర్ భవన్‌లో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమనేతగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్న ఆయన రాష్ట్రవ్యాప్తంగా డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. అనంతరం జమిందారీ భూస్వామ్య వ్యతిరేక పోరాటంతో నూజివీడు నియోజకవర్గంలో 20 వేల ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేసి కమ్యూనిస్టు పార్టీని అగ్రభాగాన నిలిపారన్నారు. ఈ తరం యువతకు దాసరి జీవితం ఆదర్శమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు, సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, అరసం జిల్లా కార్యదర్శి శిఖా ఆకాశ్, శేషయ్య, సోని, ఎం.శ్రీనివాస్‌రావు, కృష్ణ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓటుపై అవగాహన

ముదినేపల్లి, ఏప్రిల్ 27: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగకుండా సేవ చేసేవారికే ఓటు వేయాలని కోరుతూ శనివారం ముదినేపల్లి మండలం పెదగొన్నూరు గ్రామంలో కళాజాత బృందం కోరింది. గ్రామంలో పథకం మండల ఏపీఎం నాగరాజు ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల విరామ సమయంలో ఉపాధి కూలీలకు ఓటు వినియోగంపై ఏలూరు కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు వై.వీరయ్య, రవితేజ అవగాహన కల్పించారు. పని ప్రదేశంలో ఎక్కువ మంది ఓటర్లు ఉన్నందున అక్కడే ప్రదర్శన నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ బత్తుల ప్రసాద్ పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథి

అభివృద్ధి చేసి చూపిస్తా : సారథి

ఆగిరిపల్లి, ఏప్రిల్ 27: మండలంలోని వడ్లమాను, చొప్పరమెట్ల, ఈదుల గూడెం గ్రామాల్లో నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి దొరల పాలన అంతం చేసేందుకు ఒక్కసారి మీ పెద్ద పాలేరుగా తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గ అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని అన్నారు. ఈ ప్రచారంలో వయోవృద్ధుడు 110 ఏళ్ల రాణిమేకల వెంకటేశ్వర రావు ప్రచారంలో పాల్గొనటం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఆయనను సారథి సన్మానించారు. నూజివీడు నాయకులు బర్మా ఫణిబాబు, కాపా శ్రీనివాస్, చిట్నేని శివ రామకృష్ణ, జలసూత్రం వంశీ, పంగిడేశ్వరరావు, మాదాల నరేంద్ర పాల్గొన్నారు.

కొలుసు తనయుడి ప్రచారం

ముసునూరు: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి తనయుడు నితిన్‌కృష్ణ అన్నారు. శనివారం గోపవరంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షుడు బొల్లినేని బుజ్జియ్య, యువ నాయకుడు ఉప్పలపాటి గణేష్ తదితరులతో సమావేశమై గ్రామంలో పార్టీ పరిస్థితిపై సమీక్షించారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

చాట్రాయి: జనరంజక పాలన టీడీపీకే సాధ్యమని, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. సూరంపాలెం గౌడబజారులో శుక్రవారం రాత్రి టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దళితుల రక్షణ, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని, ఎన్నికల్లో దళితులంతా కూటమిని గెలిపించుకోవాలని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు గార్లపాటి మారేష్, మోదుగు ముత్తయ్య కోరారు. మండలంలోని పోలవరం దళితవాడలో శుక్రవారం రాత్రి జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.



కూటమి నాయకులకు సమస్యలు చెబుతున్న గ్రామస్థులు

సమస్యలు పరిష్కరిస్తామంటేనే ఓట్లేస్తాం

మండవల్లి: అధికార పార్టీ నాయకులు మాటలు నమ్మం. మా సమస్యలు పరిష్కరిస్తామంటే చెప్పండి ఓటేస్తాం అంటూ మండవల్లి మండలం నంది గామలంక గ్రామస్థులు ప్రచారానికి వెళ్లిన టీడీపీ శ్రేణులకు తెలిపారు. టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కొడాలి వినోద్, కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ తనయుడు కామినేని వేణుగోపాల్‌లు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమ సమస్యలు ఏకరవు పెట్టారు. గ్రామంలో తాగునీరు లేదు. రోడ్డు అధ్వానంగా మారినా పట్టించుకోలేదు. బస్సు చూసి ఏళ్ళు గడిచింది. కాలి నడకనే కిలోమీటర్లు మేర నడిచి వెళ్లవలసి వస్తోంది. అనారోగ్యంతో బాధపడే వారి పరిస్థితి చెప్పలేం అంటూ ప్రజలు తమ సమస్యలతో మొరపెట్టుకున్నారు. కైకలూరు కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ ఎన్నికల్లో గెలవగానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ శ్రేణులు హామీ ఇచ్చాయి. అంతేకాక కామినేని శ్రీనివాస్‌కి కొడాలి వినోద్ ఫోన్ చేసి గ్రామస్థుల డిమాండ్ తెలపగా తాను గెలవగానే సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని కామినేని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు జై కామినేని అంటూ నినాదాలు చేశారు. కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వినోద్, శ్రేణులు కోరాయి. పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి ఏడుకొం డలు, ఎంపీటీసీ ఉషారాణి, జిల్లా ఉపాధ్యక్షులు చాబత్తిన విజయ్, పరిశే ఇందిరమ్మ, బూత్ కన్వీనర్ నాగరాజు, పరిశే మాణిక్యాలరావు, కూటమి శ్రేణులు పాల్గొన్నాయి.



మాట్లాడుతున్న సెబ్ ఏఎస్పీ సూర్యచంద్రరావు

సారా కట్టడికి చర్యలు చేపట్టండి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 27: నూజివీడు స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో స్టేషన్ ను ఏలూరు జిల్లా సెబ్ ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు శనివారం తనిఖీ చేశారు. ఎన్ని కల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. ప్రధానంగా సారా తయారీ కేంద్రాలు, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని కట్టడి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్ఈబీ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కల్పన కుమార్తె లక్ష్మి ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించడంతో ఆమెను అభినందించారు. నూజివీడు ఎస్ఈబీ సీఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు



వాహనాల పైకి వెళ్ళిన లారీ.. తప్పిన ముప్పు

ఆగిరిపల్లి, ఏప్రిల్ 27: ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గొల్లగూడెం గ్రామాల మధ్య రహదారిపై లారీకి బ్రేక్ ఫెయిలై బీభత్సం సృష్టించింది. రహదారి పక్కన పార్క్ చేసి ఉన్న రెండు బైకులు, ఒక ఆటో, కరెంటు పోల్‌ని ఢీకొని సమీపాన మట్టిలో ఆగిపోయింది. లారీ నూజివీడు నుంచి విజయవాడ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈదర గ్రామానికి చెందిన డ్రైవర్ గురుముచ్చు చిన్న పండు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంపై పోలీసులు వివరాలు సేకరించారు.

తాళాలు పగులగొట్టి చోరీ

ముసునూరు, ఏప్రిల్ 27: వేల్పుచర్లలో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేసిన ఘటన గురువారం రాత్రి జరిగింది. పొలగాని రవి కుటుంబ సమేతంగా గురువారం గ్రామాంతరం వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరిగి వచ్చేసరికి, ఇంటి తాళాలు పగులగొట్టి తలుపులు తెరిచి ఉండటంతో బాధితుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ పి.వాసు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఈ చోరీలో 16 గ్రాముల మూడు బంగారు ఉంగరాలు, రూ. 20 వేలు విలువగల మోటారుసైకిల్ చోరీ అయినట్లు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 27 : దెందులూరు మండలానికి చెందిన ఒక విద్యార్థిని ఏలూరులోని ఒక డిగ్రీ కాలేజీలో సెకండ్ ఇయర్ చదువుతుంది. ఈనెల 26వ తేదీన యధావిధిగా బస్సులో కాలేజీకి వచ్చి తిరిగి వెళ్ళలేదు. దీంతో ఆమె తండ్రి ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయడంతో ఇన్‌ఛార్జి సీఐ కె శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మే 1న పెన్షన్ రాకుంటే జగన్‌దే బాధ్యత

కైకలూరు, ఏప్రిల్ 27: మే నెల మొదటి రోజునే ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయలేకపోతే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డే బాధ్యత వహించాలని నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. శనివారం కైకలూరులో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గత నెలలో పెన్షన్లు జాప్యం చేసి శవ రాజకీయాలకు జగన్మోహనరెడ్డి దిగారన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు ప్రభుత్వంలో పెన్షన్లు రూ.4 వేలు ఇంటి వద్దే పంపిణీ చేయిస్తారన్నారు. పెన్షన్ల సొమ్మును ప్రభుత్వ ఖజానా నుంచి కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారని, మార్చి నెలలో రూ. 13 వేల కోట్ల నిధులను కాంట్రాక్టర్లకు అప్పగించారని అవ్వా, తాతలను ఎండల్లో తిప్పుతున్నారని, వారిలో ఎవరైనా చనిపోతే దాన్ని విపక్షాలపైకి నెట్టివేసి శవరాజకీయాలు చేసి రాజకీయ లబ్ధి పొందడానికి జగన్ కుట్ర చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు నిలదీసిన తరువాత పెన్షన్లు పంపిణీ ప్రారంభించారని అధికారు లను సైతం ముఖ్యమంత్రి లోబరుచుకున్నారన్నారు. మహిళా నాయకురాలు విజయలక్ష్మి, లక్ష్మీరాణి, టీడీపీ నాయకులు రామచంద్రరావు, కేకే బాబు, ఎండీ జానీ, పి. రాధాకృష్ణ, సయ్యద్ బాషీద్, పడమటి వాసు, తేరా రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నామినేషన్ల ఉపసంహరణకు పత్రాలివ్వాలి: ఆర్వో

నూజివీడు, ఏప్రిల్ 27: నూజివీడు నియోజకవర్గపరిధిలో శాసనసభ ఎన్నికల్లో పోటీ నుంచి విరమించుకోవాలనుకునే అభ్యర్థులు సోమవారం తమ ఉపసంహరణ పత్రాలను ఆర్డీవో కార్యాలయంలో సమర్పించాలని, నూజివీడు ఆర్వో వై.భవానీ శంకరి తెలిపారు. నూజివీడు శాసనసభ స్థానం నుంచి పోటీ చేసేందుకు నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు నామినేషను ఉపసంహరించుకోవచ్చని ఆర్వో తెలిపారు.

అగ్నిప్రమాదాలు నివారించండిలా..

నూజివీడు టౌన్, ఏప్రిల్ 27: అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రమాద పరిస్థితిని బట్టి ఈ చర్యలు ఉంటాయని, నూజివీడు ఫైర్ ఆఫీసర్ కేవీ విశ్వనాథ్ అన్నారు. శనివారం నూజివీడు ఏరియా ప్రభు త్వాసుపత్రిలో అగ్నిమాపక వారోత్స వాలను పురస్కరించుకుని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. పక్కా భవనాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఫోమ్ లేదా కార్బన్ డై ఆక్సైడ్ వాయువులను ఉపయోగించి అగ్నిప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రసింగ్, ఎల్ఎఫ్ డి. ముత్తయ్య పాల్గొన్నారు.